RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి సంపుటి : 3 సంచిక : 194 ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ ఆదివారం, జనవరి 25, 2026 పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI VOLUME : 3 ISSUE NO : 194 EDITOR : MERUGU CHANDRAMOHAN Sunday, January, 25 , 2026 PAGES : 8 RS : 4 /-



### అమెరికాను కుదిపేస్తున్న మంచు

## తుఫాన్

**ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు**
**4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి**

వాషింగ్టన్, : అమెరికాను భారీ మంచు తుపానుతాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతో పాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికా లోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది.



### గణతంత్ర వేడుకల్లో..

## తెలంగాణ ప్రత్యేకత

న్యూఢిల్లీ, జనవరి24 : దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకుల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శింనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు.



**- పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి**
**- ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు**




### చైనా మిమ్మల్ని..

## తినేస్తుంది

**కెనడాకు ట్రంప్ హెచ్చరిక**

దావోస్: అమెరికా, కెనడా మధ్య సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. కెనడాను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చైనాతో వ్యాపారం కోసం అమెరికా భద్రతా ప్రయోజనాలను కెనడా పక్కనపెడుతోందని ఆరోపిస్తూ.. ఏడాదిలోపే చైనా వారిని తినేస్తుంది! అని తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో ఘాటుగా హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌పై అమెరికా ప్రతిపాదించిన.. గోల్డెన్ డోమ్.. క్షిపణి రక్షణ వ్యవస్థను కెనడా వ్యతిరేకిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఆ వ్యవస్థ కెనడాకు కూడా రక్షణ కల్పిస్తుందని, అయినా వారు చైనాతో వ్యాపారం వైపే మొగ్గు చూపుతున్నారని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఇరు దేశాధినేతల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. పెద్ద దేశాల ఆర్థిక ఆధిపత్యంపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన వ్యాఖ్యలకు ట్రంప్ కౌంటర్ ఇచ్చారు.



### టీ హబ్‌పై సీఎం రేవంత్ రెడ్డి

## కీలక ఆదేశాలు

**- టీ హబ్‌ను స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని సీఎం ఆదేశం**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** టీ హబ్‌ను ఒక ప్రత్యేక స్టార్టప్ కేంద్రంగానే కొనసా గించాలని, అందులోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌ల కోసం ఒక ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దాని స్వరూపాన్ని మార్చేలా ఇతర కార్యాలయా లను ఏర్పాటు చేసే ఆలోచనలుంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు.



### తెలంగాణ జాగృతి

## సింహ గర్జన

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాజకీయంగా బలపడడానికి అసవ రమైన రీతిలో జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నా రు. క్షేత్రస్థాయిలో ఇందుకు అవసరమైన విధంగా పునాదులు వేయాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో నిలబడాలన్న దిశగా వ్యూహం వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి నేతలు స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగనున్నారు. మున్సిపాలిటీలతో పాటు జిల్లా పరిషత్, మండలపరిషత్ ఎన్నికల్లోనూ సింహం గుర్తుతో పోటీ చేయాలని తెలంగాణ జాగృతి నాయకత్వం నిర్ణయించింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సంప్రదింపులు పూర్తి చేసిన తెలంగాణ జాగృతి నాయకత్వం.. ఆ పార్టీకి చెందిన సింహం గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించింది.

**- ఎవరికి లబ్ధి చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉప ముఖ్యమంత్రి**
**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి**
**- రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రా(ష్టానికి, సింగరేణికి నష్టంవాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఈరోజు ఉదయం ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.



### సింగరేణిపై విషపురాతలు..

## ఎవరి కోసం



### మేడారం జాతరకు తరలుతున్న జనం

**ములుగు,తెలంగాణ దిశ :** ములుగు జిల్లా మేడారం జాతరకు ప్రజలు తరలి వెళుతున్నారు. గద్దెలను దర్శించుకుని, అమ్మవారికి బంగారం సమర్పించుకోవడం ఆనవాయితీ. గిరిజన జాతర అయినప్పటికీ కులమతాలకు అతీతంగా అంతా ఇక్కడి రావడం ఆనవాయితీ. తెలంగాణ జతారలో కొన్ని మాత్రమే ప్రముఖంగా కనిపిస్తాయి. సమ్మక్క సారక్క జాతర అనేది ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన మేడారంలో జరిగే ఒక గిరిజన జాతర.

ఈ జాతర తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. వివిధ రాష్ట్రాల నుంచి పది కోట్ల మందికి పైగా హాజరవుతారని అంచనా. ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర ఈనెల 28-31 తేదీల మధ్య జరుగుతుంది. సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్బాంధవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారీ సమ్మక్క-సారక్క . ఈ జాతర గిరిజన సాంప్రదాయ రీతుల్లో జరుగుతుంది. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షల కొద్దీ తండోపతండాలుగా తరలి వస్తారు.



### మేడారంలో పారిశుద్ధ్యానికి

## పెద్దపీట

**- సురక్షిత తాగునీటి సౌకర్యం ఏర్పాటు**
**- దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు**

**ములుగు,తెలంగాణ దిశ :** దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క జాతరకు హాజరయ్యే కోట్లాది మంది భక్తులకు సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మేడారం జాతర ప్రాంతం మొత్తంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ప్రధానంగా ఈ జాతరకు హాజరయ్యే భక్తులకు తాగునీటి సౌక ర్యం, అన్ని టాయిలెట్ బ్లాక్స్ వద్ద నిరంతర నీటి సదుపాయం, అన్ని ప్రభుత్వ శాఖల వద్ద తాగునీటి సౌకర్యం, పెద్ద సంఖ్యలో టాయిలెట్ బ్లాకుల నిర్మా ణం చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం- మిషన్ భగీరథ ఆధ్వర్యంలో దాదాపు 5500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేశారు. వీటిలో, 517 బ్యాటరీ ఆఫ్ టాప్స్, 47 సిస్టెర్న్స్, 312 సిస్టర్న్ టాప్స్ , 10 చలివేంద్రాలున్నాయి. 2024 జాతరలో 5222 నల్లాలు మాత్రమే ఏర్పాటు చేయగా ఈసారి జాతరకు 5500 నల్లాలు ఏర్పాటుచేయడం జరిగింది. ఈజాతరకు గాను రూ. 13.70 కోట్ల వ్యయంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం- మిషన్ భగీరథ శాఖ ద్వారా 57 పనులను చేపట్టడం జరిగింది. గతంలో ఉన్న సదుపాయాలకు అదనంగా, ఒక అధికుల సామర్థ్యం కలిగిన బోర్ వెల్, రెండు బోరెవెల్-పంప్స్, ఐదు కొత్త సిస్టర్న్స్, ఒక కొత్త ఓ.ఎచ్.ఎస్.ఆర్,



### గాలి జనార్ధన్ రెడ్డి

## ఇంటికి నిప్పు

**శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు**

బళ్లారి: బళ్లారి-బెళగల్లు రోడ్డులోని ఒక ప్రైవేట్ నివాస లేఅవుట్‌లో ఉన్న ఒక మోడల్ ఇంటికి నిప్పంటిం చారు, ఇది నగరంలో కొత్త ఉద్రిక్తతకు దారితీసింది. బళ్లారిలో బ్యానర్ సంబంధిత ఘర్షణ కొనసాగుతుండగానే తాజాగా ఈ ఘటన చోటు చేసుకున్నది. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డి మరియు ఆయన సన్నిహితుడు బి. శ్రీరాములు యాజమాన్యంలోని జి స్క్వేర్ లేఅవుట్ లోపల నిర్మించిన మోడల్ ఇంట్లో ఈ సంఘటన జరిగింది. కొనుగోలుదారులకు లేఅవుట్‌ను ప్రదర్శించడానికి నిర్మించిన ఆ నిర్మాణం ఆ సమయంలో ఖాళీగా ఉందని పోలీసులు తెలిపారు. మానవులకు ఎటువంటి గాయాలు కాలేదని నివేదించబడింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. కొంతమంది స్థానికులు నిర్మాణంలో మంటలు చెలరేగడం గమనించి బాధ్యులను పట్టుకోవడానికి ప్రయత్నించారు, కానీ అనుమానితులు పారిపోయారని వర్గాలు తెలిపాయి.

ఈసంఘటనపైమాజీ ఎమ్మెల్యే, జనార్ధన్ రెడ్డి సోదరుడు జి. సోమ శేఖర్ రెడ్డి స్పందిస్తూ, ఈ దహనం వెనుక కాంగ్రెస్ కార్యకర్తల హస్తం ఉందని అన్నారు. జనవరి 1న జరిగిన ఘర్షణలో తమ కుటుంబానికి చెందిన ఆస్తుల ను తగలబెడతామని బెదిరింపులు వచ్చాయని ఆయన విలేకరులతో అన్నారు."అప్పుడు చెప్పినది ఇప్పుడు అమలు చేయబడింది.

## ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి

# తక్షణమే చర్యలు తీసుకోవాలి

### - కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నేత నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్,జనవరి 24, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నేత నెమలి అనిల్ కుమార్ అధికారులను కోరారు. శనివారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో నాచారం సర్కిల్ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, డివిజనల్ ఇంజనీర్ మహేశ్వరీలను నెమలి అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు, నూతన డివిజన్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వేగవంతంగా పరిష్కారాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ అభివృద్ధి పనులు సమయపాలనతో పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నెమలి అనిల్ సూచించారు. ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దంతూరి రాజు గౌడ్, బాల్ రాజ్ గౌడ్, కోయలకొండ రాజేష్, కప్పర సాయి, దాసరి సాయి తదితరులు పాల్గొన్నారు.

# సూరారం మెయిన్ రోడ్డులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ను తొలగించాలి





**కుత్బుల్లాపూర్, జనవరి 24, (తెలంగాణ దిశ)** :సూరారం మెయిన్ రోడ్డులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ను తొలగించాలని ఏఈ వీరేశం, డిఈ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ లకు సామాజిక, పర్యావరణ ప్రేమికుడు, కొల రవీందరు ముదిరాజ్ వినతిపత్రం సమర్పించారు. కాలనీకి వందలాది, భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వివరించారు గతంలో ఒక లారీ వల్ల పెను ప్రమాదం తృటిలో తప్పిందని వివరించారు. ట్రాన్స్ ఫార్మర్ తీసివేయాలని గతంలో ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు. ఇందుకు స్పందించిన విద్యుత్ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ ను మరో చోటికి తరలిస్తారని తరలిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కృష్ణారెడ్డి, రాజు, హుస్సేన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ పరిరక్షణ సభకు తరలివెళ్లిన శేరిలింగంపల్లి నియోజకవర్గ శ్రేణులు



**శేరిలింగంపల్లి, జనవరి 24, (తెలంగాణ దిశ) :** భాగ్యనగర్ ఉత్సవ కమిటీ గణేష్ సేన ఆధ్వర్యంలో జాగో భాగ్య నగర్ ఛలో బాలాపూర్ నినాదంతో నిర్వహిస్తున్న ధర్మ పరిరక్షణ సభ కు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ జాగో భాగ్య నగర్ ఛలో బాలాపూర్ కార్యక్రమాన్ని భాగ్య నగర్ ఉత్సవ కమిటీ, గణేష్ సేన చేపట్టడం చాలా మంచి విషయమని అన్నారు. మనమందరం ఆలోచించి ఒక్కటిగా పోరాడాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. మన ప్రజల వ్యాపారాలను, ఆక్రమించి దెబ్బ కొడుతున్న బంగ్లాదేశ్ రోహింగ్య ముస్లిం చొరబాటు దారులను అరెస్టు చేసి తిప్పి పంపే వరకు పోరాడాలని అన్నారు. ఓట్ల రాజకీయం కోసం కొన్ని పార్టీలు అక్రమంగా ఓటర్ ఐడీ కార్డులు, ఆధార్ కార్డులు ఇప్పించి మనకే ముప్పు తయారు చేస్తున్నారని అన్నారు. వాళ్ళు మన ప్రజలకు కల్తీ ఫుడ్, వస్తువులు, అమ్ముతూ మన ఆరోగ్యాలపై దాడి చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. డ్రగ్స్ మాఫియా కు సహకరిస్తూ మత్తుకు బానిసలను చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విలువైన భూములను ఆక్రమిస్తూ, మన దేవాలయాలను ధ్వంసం చేయడం, దాడులు చేయడం, అక్రమ గోవధకు పాల్పడుతున్నారని అన్నారు. మనతో ఉంటూ మన దేశ భద్రతకు ముప్పు తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, అశోక్ కుమార్, నాగుల్ గౌడ్, అనిల్ గౌడ్, రామ్ రెడ్డి, రాధాకృష్ణ యాదవ్ , మాణిక్, ఎల్లేష్, నరేందర్ యాదవ్, సంజీవ్ స్వామి గౌడ్, నరేందర్ ముదిరాజ్, వేణుగోపాల్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజంలో నిబద్ధతకు గుర్తింపు..
# పటేల్ నర్సింహులు యాదవ్‌కు ఘన సన్మానం




**కాప్రా, జనవరి 24, (తెలంగాణ దిశ)** :నవతెలంగాణ హైదరాబాద్ రీజియన్ సమావేశంలో చర్లపల్లి రిపోర్టర్ గా ఉత్తమ పనితీరు కనబర్చినందుకు పటేల్ నర్సింహులు యాదవ్ ను ఘనంగా సన్మానించారు. జర్నలిజం వృత్తిలో నిబద్ధతతో రాణిస్తూ, వార్తా రంగంలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్ , జనరల్ మేనేజర్ లింగారెడ్డి చేతుల మీదుగా పటేల్ నర్సింహులు యాదవ్ ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మెఫిషియల్ ఇంచార్జీ వేణుమాధవ్, మేనేజర్లు భరత్, ఉపేందర్, డెస్క్ ఇంచార్జీ శివ కిరణ్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులు పటేల్ నర్సింహులును అభినందించారు.

## ఆలేరు యాదగిరిగుట్ట మున్సిపాలిటీల ఎన్నికల ఇంచార్జీగా బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, జనవరి 24, (తెలంగాణ దిశ)** :త్వరలో జరగనున్న మున్సి పల్ ఎన్నికల సందర్భంగా యాదా ద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, యాదగిరిగుట్ట మున్సి పాలిటీల ఎన్నికల ఇంచార్జీగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని పార్టీ నియమించింది. మున్సిపాలిటీల వారీగా ఎన్నికల ఇంచార్జీలను బీఆర స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నియమించారు. ఇందులో భాగంగా బీఆర స్ పార్టీ ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటిల ఎన్నికల ఇంచార్జీగా బండారి లక్ష్మారెడ్డిని నియమించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలలో బిఆర స్ జండా ఎగరవేస్తామని లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

## చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీగా చింతల వెంకటేశ్వర రెడ్డి



**భువనగిరి, జనవరి 24, (తెలంగాణ దిశ)** :త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చౌటుప్పల్ మున్సిపల్ పార్టీ ఎన్నికల పార్టీ ఇంచార్జీగా బిఆర స్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి నియమి తులయ్యారు. మున్సిపల్ ఎన్నికలకు మున్సిపాలిటీల వారీగా పార్టీ ఇంచార్జీలను బీఆర స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నియమించారు. ఇందులో భాగంగా బీఆర స్ పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటి ఎన్నికల ఇంచార్జీగా చింతల వెంకటేశ్వర్ రెడ్డిని నియమించారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో చౌటుప్పల్ మున్సిపాలిటీలో బిఆర స్ జండా ఎగరవేస్తామని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. తనను చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల పార్టీ ఇంచార్జీగా నియమిం చిన కేటీఆర్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయ చైతన్య సదస్సులో విద్యార్థినీలకు చట్టాలపై అవగాహన






**ఏఎస్ రావునగర్, జనవరి 24,(తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, మల్కాజిగిరి జిల్లా జడ్జి బాల భాస్కర్ ఆదేశాల మేరకు శనివారం జాతీయ బాలికల దినోత్సవం (నేషనల్ గర్ల్ చైల్డ్ డే) సందర్భంగా కుషాయిగూడ లోని సాయి సుధీర్ విద్య సంస్థలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినీలకు బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, వరకట్న నిషేధ చట్టం, లింగ నిర్ధారణ చట్టం 1994 లతో పాటు ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సీనియర్ సివిల్ ప్రిన్సిపాల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సత్తు రవీందర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటరమణ, గోపాల్ రెడ్డి, గౌరిత, సమాధుల్లాహ్, ధనజ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మీరారాణి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మహాలక్ష్మిమమ్మ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**కుత్బుల్లాపూర్, జనవరి 24, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కుత్బుల్లాపూర్ కు చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పండగవెంకటేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి, సాదు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, శివారెడ్డి, నరసింహారెడ్డి, రాజు చారి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 3 లక్షల కోట్లు దాటిన వైజాగ్ డేటా సెంటర్

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్గా రూపుదిద్దుకుంటోంది. టెక్ దిగ్గజాలు, ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ డేటా సెంటర్ల ఏర్పాటుకు క్యూ కట్టడంతో, మొత్తం పెట్టుబడులు ఏకంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరినట్లు తెలుస్తోంది.తాజాగా ఈ పెట్టుబడుల సునామీకి ఊతం ఇస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో భారీ అడుగు వేసింది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ , డిజిటల్ రియాల్టీ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన 'డిజిటల్ కనెక్షన్' విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం గల అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుంది.ఈ ప్రాజెక్టుకోసం రిలయన్స్ జాయింట్ వెంచర్ సుమారు రూ. 98,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. 2030 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. రిలయన్స్‌తో పాటు ఇప్పటికే ప్రపంచ దిగ్గజ సంస్థలు విశాఖలో భారీ పెట్టుబడులు ప్రకటించాయి. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో 1ఉచి సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్. రూ. 1.10 లక్షల కోట్లతో డేటా సెంటర్ల నిర్మా ణం.

# ధర్మ రక్షణ సభకు తరలివెళ్లిన హిందూ బంధువులు




**కుషాయిగూడ, జనవరి 24, (తెలంగాణ దిశ)** :భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి, గణేష్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాగో భాగ్య నగర్, చలో బాలాపూర్ ధర్మ రక్షణ సభకు ఉప్పల్ నియోజకవర్గం భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ నుంచి హిందూ బంధువులు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గం కన్వీనర్ చల్ల ప్రభాకర్ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంకో, కన్వీనర్లు, డివిజన్ కన్వీనర్లు, ఉత్సవ సమితి నాయకులు, స్థానిక నాయకులు, రామ భక్తులు, హనుమాన్ భక్తులు,మహిళలు, హిందూ బందువులు, ధర్మ రక్షకులు పాల్గొన్నారు.

# అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలు

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం ఆయనకు అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలుగా మారే అవకాశాలున్నాయి. నిధుల కొరతతో పాటు సంక్షేమాన్ని అమలు చేయడం కత్తిమీద సాముగా మారింది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్న ప్రయత్నంలో ఆయన ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పేశారు. మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు ఆడబిడ్డ పథకం కింద.. నిరుద్యోగుల కు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రతిపక్ష వైసీపీ పదే పదే గుర్తు చేస్తుంది.రెండు పథకాలు అమలు చేయాలంటే అంత సులువు కాదు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చెందిన ఆస్తులు అమ్మాల్సిందేనని అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అర్హులు ఎందరు ఎవరికి ఇస్తారన్న దానిపై పథకం క్లిక్ అయ్యేది ఆధారపడి ఉంటుంది.

ఏదో కొందరికి ఇచ్చామని మమ అనిపించడానికి వీలులేదు. మహిళల్లో ఒకరికి వచ్చి పది మందికి పథకం రాకపోతే ఇరవై మంది వ్యతిరేకమవుతారు. నిరుద్యోగ భృతి కూడా అంతే. అది అమలుకు సాధ్యమయ్యే హామీ కాదు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వాలంటే ఖజానా సరిపోదు. అందుకే చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. విధ్వంసం నుంచి బయటపడేస్తున్నామని చెప్పాలనుకున్నా కుదిరే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే రెండేళ్ల సమయం పూర్తయి ంది. ప్రస్తుతం గ్రౌండ్ చేసిన హామీలను అమలు చేయడానికే అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రతి నెల అప్పుల కోసం ఢిల్లీ వైపు చూడాల్సి వస్తుంది. మరొకవైపు రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం వంటివి కూడా సవాలుగా మారుతున్న సమయంలో చంద్రబాబు నాయుడు ఈ రెండు పథకాలను అమలు చేయడానికి అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి తలకిందులు తపస్సు చేసినా సాధ్యం కాదన్నది ప్రతిపక్షం ఆలోచన.

# రూ. 17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లు రికవరీ





**శేరిలింగంపల్లి, జనవరి 24,(తెలంగాణ దిశ)** : పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రూ.17 లక్షల విలువైన 64 మొబైల్ ఫోన్లను గుర్తించి, పేట్ బషీరాబాద్ పీఎస్ లో శనివారం సంబంధిత యజమానులకు పోలీసులు తిరిగి అందజేశారు. ఈసందర్భంగా మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వారు వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్ లో తమ మొబైల్ వివరాలునమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేట్ బషీరాబాద్ పీఎస్ ఎస్ హెచ్ ఓ కె. విజయ వర్ధన్, డీఐ డి. అజయ్ కుమార్, డీఎస్ ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పైరసి దొంగ... రాబిన్ హుడ్డా..!

ఇప్పుడు ఎక్కడ చూసినా సరే ఐ బొమ్మ రవి పేరే వినిపిస్తుంది. మారుమూల పల్లెటూర్లలో కూడా రవి పేరు మార్మోగిపోతుంది. పోలీసుల వెర్షన్‌లో అతడో పైరసీ దొంగ. టాలీవుడ్ కోణంలో అతడో రాబిన్‌హుడ్.. సామాన్యుల మాటల్లో అతడో చిన్నపాటి దేవుడు. ఇలా ఐబొమ్మ రవి చుట్టూరా ఒక రక్తి కట్టించే వెబ్‌సిరీస్ పరుగులు పెడుతోంది. రవి..ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో టాక్ ఆఫ్‌ది టౌన్‌గా మారాడు. ఎవడైనా దొంగ దొరికితే, చట్టప్రకా రం శిక్షించండి అన్నది అన్ని వర్గాల నుంచి వచ్చే మాట. కానీ ఐబొమ్మరవిని దొంగ అంటూనే దేవుడుగా కీర్తిస్తోంది ప్రేక్షకుల లోకం. అసలు దొంగలు టాలీవుడ్‌లోనే ఉన్నారంటూ రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు మరికొందరు. ఎవరి వాదన ఎలా ఉన్నా..ఇప్పుడు ఐబొమ్మరవి రాబిన్‌హుడ్‌తో పోల్చుతున్నారు. పోలీసులు, సినీ ఇండస్ట్రీ చీటర్, హ్యాకర్ అంటున్నా సరే సామాన్య జనాలు మాత్రం మా హీరో అంటున్నారు. ఇంతకీ ఐ బొమ్మ రవి ఇంత భారీ మద్దతు ఎలా కూడగట్టాడు అనేదే ఇక్కడ అందరికీ వస్తున్న ప్రశ్న. దానికి కారణం కూడా సినిమా ఇండస్ట్రీ అనే చెప్పాలి. అవును సినిమా వాళ్లు చేస్తున్న పనుల వల్లే ఐ బొమ్మ రవి సామాన్యుల హీరో అయ్యాడు. సింగిల్ థియేటర్ల ప్లేస్ లో మల్టీప్లెక్స్ లు వచ్చి పడ్డాయి. టికెట్ కౌంటర్ క్లోజ్ అయి బుక్ మై షో లాంటివి వచ్చేసాయి. ప్రతి సినిమాకు విపరీతంగా టికెట్ రేట్లు పెంచేసి అమ్ముకుంటున్నారు. పైగా ప్రభుత్వాలు స్పెషల్ జీవోలు ఇచ్చి మరి బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు లాంటివి చేయడం వల్ల సామాన్యులు సినిమా థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసే పరిస్థితి లేకుండా పోయింది. వీటికి తోడు ఒక ఫ్యామిలీ సినిమా థియేటర్ కు వెళితే పాప్ కార్న్, సమోసాలు, కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్ లాంటివి బయట దొరికే రేట్ల కంటే 20 రేట్లు ఎక్కువగా పెంచేసి అమ్మడంతో సామాన్యుల జేబుకు చిల్లు పడుతుంది. పైరసీ తప్పయితే సినిమా టికెట్ల రేట్లు పెంచడమూ తప్పే.. ఒక ఇంట్లో నలుగురం సినిమాకు పోతే మూడు వేలు ఖతం అవుతున్నాయి.. ఐ బొమ్మలో ఫ్రీగా ఇంటిల్లిపాదీ సినిమా చూస్తున్నం.. అంటున్నారు నెటిజెన్లు.. ఇంతకు సినిమా నిర్మాతలను వందల కోట్లు పెట్టి ఎవరు సినిమాలు తీయుమన్నారంటూ ప్రశ్నిస్తున్నారు.. మొన్నటి ప్రెస్ మీట్ లో ఐ బొమ్మ రవిని ఎన్ కౌంటర్ చేయాలన్న నిర్మాత సీ కల్యాణ్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేసిన తప్పుల చిట్టాను ఎత్తి చూపుతున్నారు. పైరసీ చేసే వాళ్లు సంఘ సేవల చేయట్లేదన్న ఎస్ఎస్ రాజమౌళికీ నెటిజెన్లు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మీరేమైనా సంఘ సేవ చేస్తున్నారా.. వినోదం పేరుతో బిజినెస్ చేస్తున్నారు కదా.. మిమ్మల్ని విదేశాలకు వెళ్లి ఎవరు షూటింగులు చేయుమన్నారని ప్రశ్నిస్తున్నారు.. వందల కోట్లు పెట్టి ఎవరు సినిమా తీయుమన్నారంటూ సీరియస్ అవుతున్నారు. సినిమాను పైరసీ చేయడం తప్పయితే టికెట్ల రేట్లు పెంచుకోవడం కూడా తప్పే అని ముక్త కంఠంతో వాదిస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో సినిమాలను విపరీతంగా ఇష్టపడే జనాలు ఎక్కువ. సినిమాలు చూడాలనే ఆశ ఉన్నా సరే కుటుంబాన్ని తీసుకొని వెళ్లి చూడగలిగే పరిస్థితులు లేకపోవడంతో సామాన్యులు అందరూ కూడా ఐ బొమ్మను ఎంచుకున్నారు. వేలు పెడితే గాని సినిమా చూడలేని వాళ్లకు ఉచితంగా ఐ బొమ్మలో సినిమాలు చూసే అవకాశం రావడం వల్ల థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేవాళ్ళు చాలా తగ్గిపోయారు. క్రమక్రమంగా ఇది పెరిగి థియేటర్లకు వెళ్లే వాళ్ళ సంఖ్య భారీగా తగ్గిపోయి ఐ బొమ్మకు విపరీతంగా క్రేజ్ పెరిగింది. బొమ్మరవికి సోషల్ మీడియాలో రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో 'ఐబొమ్మ' ట్రెండింగ్‌లో ఉంది. పేదలు, మధ్య తరగతి వాళ్ల కోసమే పైరసీ చేశాడంటూ పోస్టులు పెడుతున్నారు. థియేటర్ రేట్లు భారీగా పెంచడం వల్లే ఐబొమ్మకు అలవాటు పడ్డామంటూ ట్వీట్లు కూడా వస్తున్నాయి. సామాన్యులకు అందనంత రేట్లు పెంచి సినిమా థియేటర్లకు రానివ్వని పరిస్థితి తీసుకొచ్చింది టాలీవుడ్‌లోని కొందరు పెద్దలే అంటూ ఐబొమ్మరవిని దేవుడిని చేసి చూస్తోంది ప్రేక్షకలోకం. అతడు తమ దృష్టిలో హీరో అని, అసలు విలన్ టాలీవుడే అని పాయింట్‌తో ఐబొమ్మ రవికి అండగా నిలుస్తున్నారు కొందరు ప్రేక్షకులు. తాజాగా ఖమ్మంలో ఓ ఆటో డ్రైవర్ తన వాహనంపై ఏకంగా ఇమ్మది రవి ఫోటో వేయించాడు. తెలంగాణ రియల్ హీరో ఐబొమ్మ రవి అంటూ అక్కడ రాసుకొచ్చాడు. ప్రజంట్ ఆ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈరేంజ్‌లో ఐబొమ్మరవికి సపోర్ట్ వస్తుందని పోలీసులు, ఇటు టాలీవుడ్ పెద్దలు కూడా ఊహించలేదు. రవిని హీరోగా చూడటాన్ని ఇండస్ట్రీ ఖండిస్తోంది. ఐబొమ్మ రవిని సోషల్ మీడియా దేవుడిగా చూడటం మానుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది. అయితే ఐ-బొమ్మ రవి అరెస్ట్‌పై సీనియర్ అడ్వొకేట్, నటుడు సివిఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఐ బొమ్మ రవిని అంతా రాబిన్‌హుడ్‌లా చూస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడితే.. సినిమాల్లో మాదిరిగా ఒకడు పుట్టుకొస్తాడని రవి నిరూపించాడన్నారు. ఐబొమ్మ రవికి నెటిజెన్ల నుంచి పెద్ద సపోర్ట్ లభిస్తోంది. ఏకాణ తీసుకోకుండా కొత్త సినిమాలు చూపిస్తున్నాడంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. మధ్య తరగతి దేవుడనీ పోస్టులు పెడుతున్నారు. ఠాగూర్ సినిమాలో చిరంజీవి మాదిరిగా తారీఫ్ చేస్తున్నారు. అరెస్టు చేసిన పోలీసుపై ఏకంగా మీమ్స్ చేస్తున్నారు. దీనిపై సీపీ సజ్జనార్ మండిపడ్డారు. ఐ బొమ్మ రవిని అరెస్టు చేస్తే ప్రజలు తమపై మీమ్స్ చేస్తున్నారని, వారిపైనా కేసులు పెడతామంటూ హెచ్చరించారు. దీనిపైనా నెటిజెన్లు గట్టిగానే స్పందించారు. బంగారం దుకాణంలో చోరీ జరిగితే షాపు యజమానులను పక్కన కూర్చోబెట్టుకొని ప్రెస్ మీట్ పెడతారా.. సీపీగారూ.. అంటూ ప్రశ్నిస్తున్నారు. నిర్మాతలు, సినిమా హీరోలు, దర్శకులతో కలిసి సీపీ సజ్జనార్ ప్రెస్ మీట్ పెట్టడాన్ని తప్పు పడుతున్నారు. ఐ బొమ్మ రవి రియల్ హీరో అని రియల్ రాబిన్ హుడ్ అని పేర్కొంటున్నారు. ఆయన వెర్షన్‌లో అయితే సైబర్ క్రైమ్‌ను అడ్డుకునేందుకు ఐబొమ్మ రవిని డిపార్ట్‌మెంట్‌లోకే తీసుకోవాలని అప్పీల్ చేస్తున్న పరిస్థితి. ఈరేంజ్‌లో ఐబొమ్మరవికి క్రేజ్ పెరిగింది. థియేట ర్లలో లక్ష మంది చూస్తే ఐ బొమ్మలో 50 లక్షల మంది చూసే వాళ్ళు ఉన్నారు. ఇప్పుడు ఐ బొమ్మ రవిని అరెస్టు చేయటంతో ఉచితంగా సినిమాలు చూసే అవకాశం లేకుండా పోయింది. అందుకే సామాన్య జనాలు అందరూ కూడా ఇప్పుడు ఐ బొమ్మ రవికి ఇంతగా సపోర్ట్ చేస్తున్నారు బయటకు రావాలని కోరుకుంటున్నారు. మరి ఐ బొమ్మ రవి బయటకు వస్తాడా లేదా అనేది చూడాలి.

# సహారా రిఫండ్ ప్రక్రియకు ఇంత జాప్యమేల




సహారా గ్రూప్ తమ ఆప్షనల్లి ఫుల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్ల ద్వారా సేకరించిన నిధులను తిరిగి చెల్లించే అంశం దీర్ఘకాలిక వివాదంగా మారింది. భారత్‌లో సాగుతున్న సంక్లిష్ట ఆర్థిక వివాదాలలో ఇది అత్యంత ప్రధానమైనది. సుప్రీంకోర్టు అనేకసార్లు జోక్యం చేసుకున్నప్పటికీ, సహారా పథకాలలో ముఖ్యంగా సహకార సంఘాల ద్వారా పెట్టుబడి పెట్టిన కోట్లాది మంది ప్రజలు తమ డబ్బు ఎప్పుడు వస్తుందో ఇప్పటికీ తెలియక ఆందోళనలో ఉన్నారు. ఈ వివాదం దాదాపు దశాబ్దం క్రితం ప్రారంభమైంది. సహారా గ్రూప్ తమ ఓఎఫ్‌సిడి లు హైబ్రిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ అని, అవి సెబీ పరిధిలోకి కాకుండా కంపెనీల రిజిస్ట్రార్ పరిధిలోకి వస్తాయని వాదించింది. తాము ఇప్పటికే ఆర్ఓసి అనుమతి తీసుకుని, అవసరమైన పత్రాలను సమర్పించి బాండ్లు జారీ చేశామని సహారా పేర్కొంది. కానీ సెబీ దీనిని అంగీకరించలేదు. సహారా కంపెనీలు బాండ్ల జారీని ఆపి, పెట్టుబడిదారులకు డబ్బు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని సహారా కోర్టులో సవాలు చేయడంతో కేసు చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. 2012 జూన్‌లో జరిగిన తుది విచారణ సమయంలో, సహారా 93 శాతం పెట్టుబడిదారులకు ఇప్పటికే చెల్లింపులు పూర్తయ్యాయని, మొత్తం రూ. 23,500 కోట్లు తిరిగి ఇచ్చిందని తెలిపింది. ఇంకా సుమారు రూ. 2,260 కోట్లు మాత్రమే బాకీ ఉన్నాయని, అయితే ఇప్పటికే రూ. 12,000 కోట్లను కోర్టు ఆదేశాల మేరకు జమచేశామని, వడ్డీలతో అది రూ. 16,000 కోట్లకు పెరిగిందని తెలిపింది. 2012 ఆగస్టులో సుప్రీంకోర్టు తుది ఉత్తర్వు ఇచ్చేటప్పటికి మెజారిటీ పెట్టుబడిదారులకు తాము చెల్లింపులు పూర్తి చేశామని, ఇప్పుడే మళ్లీ డబ్బు చెల్లించడం "ఒకే బాధ్యతపై రెండోసారి చెల్లింపు" అవుతుందని సహారా వాదించింది. ఇదిలా ఉండగా, సెబీ 144 కంటే ఎక్కువ పత్రికల్లో నాలుగు సార్లు ప్రకటనలు ఇచ్చి పెట్టుబడిదారులను రిఫండ్ కోసం దరఖాస్తు చేయమని పిలుపునిచ్చింది. అయినప్పటికీ చాలా కొద్ది మంది మాత్రమే ముం దుకు వచ్చారు. 2014 అక్టోబరు నాటికి కేవలం 4,600 మంది మాత్రమే రిఫండ్ దరఖాస్తులు చేశారు. సెబీ వద్ద ఉన్న రూ. 16,000 కోట్లలో కేవలంరూ.64 కోట్లు మాత్రమే తిరిగి చెల్లించగలిగింది. ఇది రిఫండ్ ప్రక్రియలోని లోపాలపై ప్రశ్నలు రేకెత్తించింది. సహారా మాత్రం తాము చాలా మందికి నేరుగా డబ్బు ఇచ్చేశామని, సెబీ వద్ద ఉన్న రికార్డులు సరికాదని వాదించింది. బ్యూరోక్రసీ కూడా ఈ ప్రక్రియను మరింతక్లిష్టం చేసింది. 2013లో సహారా మూడు కోట్లకుపైగా అప్లికేషన్ ఫారాలు, రెండు కోట్ల రిడంప్షన్ ఓచర్లు ఉన్న 127 లారీలను సెబీకార్యాలయానికి పంపింది. అయితే అవి కార్యాలయ సమయం తర్వాత రావడంతో సెబీ రెండో విడత డాక్యుమెంట్లను స్వీకరించలేదు. చాలా రికార్డులు అసంపూర్ణంగా ఉండటంతో పెట్టుబడిదారుల నిజమైన వివరాలను నిర్ధారించడం కష్టమైంది. సహారా మాత్రం 95 శాతం పెట్టుబడిదారులకు తాము ఇప్పటికే చెల్లించినట్టు మళ్లీ చెబుతోంది. ఇన్ని సమస్యల మధ్య, ఇటీవల కొంత పురోగతి కనిపించింది. 2023లో సుప్రీంకోర్టు సెబీ సహారా రిఫండ్ అకౌంట్‌లోని రూ. 5,000 కోట్లను సహారా సహకార సంఘాల పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించేందుకు కేంద్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ కు బదిలీ చేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నడుస్తున్న ఈ ప్రక్రియలో కొంతమంది పెట్టుబడిదారులు డబ్బు పొందారు. 2025 జూలై నాటికి 27 లక్షల మందికి పైగా పెట్టుబడిదారులకు రూ. 5,000 కోట్లకుపైగా చెల్లించారు. అయితే మరో 1.08 కోట్ల మంది ఇంకా వేచి ఉన్నారు. సహారా సహకార సంఘాల పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. చిన్న పెట్టుబడిదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని హామీ ఇచ్చింది. రిఫండ్ ప్రక్రియ క్లిష్టతను దృష్టిలో పెట్టుకుని సుప్రీంకోర్టు గడువును డిసెంబర్ 2025 వరకు పొడిగించింది. అయితే సమస్య ఇంకా పూర్తిగాపరిష్కారం కాలేదు. సహారా వివిధ పథకాల ద్వారా సేకరించిన మొత్తం రూ. 25,000 కోట్లకు పైగానే ఉంది. సెబీ వద్ద ఉన్న ఈ నిధుల్లోనూ ఇప్పటి వరకు 20,000 కంటే తక్కువ రిఫండ్ దరఖాస్తులు మాత్రమే అందాయి. అసంపూర్ణ వివరాలు, ధ్రువీకరించలేని ఫారాలు, స్పందన రాని పెట్టుబడిదారులు వంటి సమస్యలతో చాలా దరఖాస్తులు మూసివే శారు. దీంతో అసలు పెట్టుబడిదారుల అందరికీ నిజంగా డబ్బు చేరుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సహారా స్థాపకుడు సుబ్రత రారు మరణం తర్వాత, సెబీ వద్ద మిగిలి ఉన్న రూ.25,000 కోట్ల భవితవ్యంపై ప్రశ్నలు మరింత పెరిగా యి. కొంతమంది పెట్టుబ డిదారులు డబ్బు పొందినా, పెద్ద భాగం పెట్టుబడిదారులు ఇప్పటికీ నెమ్మదిగా సాగుతున్న ఈ ప్రక్రియలో ఇరుక్కుపోయారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఈ మొత్తం రిఫండ్ వ్యవస్థను పర్యవేక్షిస్తూనే ఉంది. అయితే ప్రధాన ప్రశ్న మాత్రం ఇంకా అలాగే ఉంది. అదే 'మిగిలిన పెట్టుబడిదారుల డబ్బు ఎప్పుడు తిరిగి వస్తుంది' అన్నది!

# సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పనులు

**ఖమ్మం,తెలంగాణ దిశ :**రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయా లతో ముందుకు వెళుతుందా,వెనక్కి వెళుతుందా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు విద్యుత్తు రంగ నిపుణుల నుంచి తీవ్ర ఆశ్చర్యం, అసంతృప్తి వ్యక్తమవు తున్నాయి. నిర్ణయాలపై చర్చ మొదలైంది. రాష్ట్రంలో ఏటికేడాది పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, అలాగే రాబోయే పదేండ్లకు ఎంత కరెంటు అవసరం, ఎంత ఉత్పత్తి అవసరమనేదానిపై క్యాబినెట్ భేటీలోచర్చించి, అధికా రులు తయారుచేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను చూసిన తరువాత రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించాలని, అలాగే పాల్వంచ, మక్తల్‌లలో థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలనే నిర్ణయాలపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తంఅవుతోంది. ఇప్పటికే ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి వస్తున్న కాలుష్యం, గుట్టలకొద్దీ పోగవుతున్న బూడిదను ఏం చేయాలో తెలియక అధికారులు అల్లాడుతుండగా.. మరిన్ని థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించాలనే ఆలోచనపై విద్యుత్‌రంగ నిపుణుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి థర్మల్ విద్యుత్తు కన్నా.. రెన్యూవబుల్ (పునరుద్ధరణీయ) ఇంధన వనరుల ఉత్పత్తి, వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం అనేక రకాల పథకాలను అమలులోకి తీసుకొస్తోంది. పర్యావరణానికి విఘాతం కల్గించే థర్మల్ విద్యుత్తును మెల్లగా తగ్గిస్తూ.. సౌర, పవన, జల విద్యుత్తులపై దృష్టి సారించేలా మార్గదర్శకాలను కూడా కేంద్రం జారీచేసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం క్యాబినెట్ సమావేశంలో ఇందుకు అనుగుణంగా.. 3,000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండ ర్లు పిలవాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే కొత్తగా 2,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్‌ను కొనుగోలుకు వీలుగా టెండర్లు పిలవాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనితోపాటు రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా.. ఆసక్తిచూపే కంపెనీలను అవసరమైన భూమి, నీటిని కేటాయించాలనికూడా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుని ప్రకటించారు. ఈ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ముందుగా మన డిస్కంలకే అమ్మాలనే షరతుపైకూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనితోపాటు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా.. రాష్ట్రంలో కొత్తగా స్థాపించే పరిశ్రమలు వాటి అవసరాలమేరకు సొంతంగా (క్యాప్టివ్) ఉత్పత్తి చేసుకు నేందుకు వీలుగా వెంటనే అనుమతులు ఇవ్వాలనికూడా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. నిజానికి ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)ను మెల్లమెల్లగా తగ్గిస్తూ వస్తున్నారు. సౌర, జల, వాయు విద్యు త్తు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఇలా థర్మల్‌ను తగ్గిస్తూ వస్తున్నారు. తెలంగా ణ జోన్‌కో ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొత్తం 5580 మెగావాట్ల సామర్థ్యంతో ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాలున్నాయి. 2023- 24లో 79.64 శాతం పీఎల్ఎఫ్‌తో విద్యుత్తును ఉత్ప త్తి చేయగా.. 2024-25లో 65.01 శాతం పీఎల్ఎఫ్‌తో థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల లో ఉత్పత్తిని చేశారు. అదే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (నవంబర్ 13 నాటికి) కేవలం 56.03 శాతం పీఎల్ఎఫ్‌తోనే థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ఉత్పత్తి చేస్తుండటం గమనార్హం. పైగా యాదాద్రి థర్మల్‌లో మరో మూడు యూనిట్లు (2400 మెగావా ట్లు) వచ్చే సంవత్సరం నాటికి పూర్తిగా అందుబాటులోకి రా నుంది.

దీనికితోడు ప్రైవేటు థర్మల్ ప్లాంట్ల నుంచి, అలాగే కేంద్రం నుంచి మనకు వస్తున్న థర్మల్ విద్యుతు ఉండనే ఉంది. ఇదీ కాకుం డా.. సింగరేణి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద మూడో యూనిట్ (800 మెగావాట్లు) పనులుకూడా ప్రారంభం అయ్యాయి. ఒకవంక థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) శాతాన్ని తగ్గిస్తూ...ఉత్పత్తిని తగ్గిస్తూనే..మరోవంక కేంద్రం రెన్యూవబుల ఎనర్జీపై మార్గదర్శకాలను ఉటంకిస్తూ.. సౌర, వాయు, జల విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంపై ఫోకస్ పెట్టామని చెబుతున్న ప్రభుత్వం.. మరోవైపు కొత్తగా థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించాలనే ఆలోచన చేయడం విద్యు త్తు రంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకుల అసంతృప్తికి కారణమవుతోంది. సౌర విద్యుత్తు పగటిపూట ఉత్పత్తి అవుతుందని.. రాత్రిపూట, డిమాండ్ ఉన్నప్పుడు ఎలా అనే అనుమానాలకు పరిష్కారం చూపింది.. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం (బీఈఎస్ఎస్). మంగళవార మే తెలంగాణ జోన్‌కో ఆధ్వర్యంలో 750 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తును నిల్వచేసి డిమాండ్ ఉన్నప్పుడు వాడుకునేలా గ్లోబల్ టెండర్లనుకూడా పలిచింది. అలాగే సింగరేణి ఆధ్వర్యంలో మొట్టమొద టిసారిగా మందమర్రిలో ఒక మెగావాట్ సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం (బీఈఎస్ఎస్) నిర్మాణం పూర్తయ్యింది. రెండు రోజుల్లో దీనిని ప్రారంభించనున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఇలాంటి బీఈఎస్ఎస్ లను ఏర్పాటు చేస్తామని సింగరేణి ప్రకటించింది. అంటే ఇంతవరకు లేని విధంగా సౌలభ్యం మనకు అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 5,580 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి వస్తోన్న బూడిదను ఏం చేసుకోవాలో అర్థంకాక.. అధికా రులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో సుమారు 10 కోట్ల మెట్రిక్ టన్నుల బూడిద పేరుకుపోయిందని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా మరిన్ని థర్మల్ విద్యుత్తు కేంద్రాలను నిర్మించాలని క్యాబినెట్‌లో తీర్మానించడం.. పైగా అసలే బొగ్గు లేని మక్తల్ లాంటి ప్రదేశాల్లో థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై అధ్యయనం చేయాలనే క్యాబినెట్ నిర్ణయం వెను క ఏం జరిగి ఉంటుందనే ఊహాగానాలు పుట్టుకొస్తున్నాయి. పర్యావర ణహితమైన రెన్యూవబుల్ ఎనర్జీ, అలాగే గ్రీన్, క్లీన్ ఎనర్జీపై మంచి నిర్ణయాలు తీసుకున్నారని అందరూ అనుకున్నారు. కానీ.. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యు త్తు కేంద్రంతోపాటు.. పాల్వంచతోపాటు బొగ్గు గనులతో ఎలాం టి సంబంధంలేని మక్తల్‌లో థర్మల్ విద్యు త్తు కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కూడా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం విస్మయం. రాష్ట్రంలో పరిస్థితులు సౌర, పవన, హైడ్రో, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తికి అనుకూలంగా ఉండగా.. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకున్న క్యాబినెట్.. మరోవైపు పర్యావరణానికి విఘాత కల్గిస్తున్న, ఇప్పటికే కోట్ల మెట్రిక్ టన్నుల బూడిద నిల్వలను మనకు మిగిల్చిన థర్మల్ విద్యుత్తు కేంద్రాలను కొత్తగా నిర్మించాలనే నిర్ణయం తీసుకోవడంతో.. ప్రభుత్వం ముందుకు వెళుతుందా.. వెనక్కి వెళుతుందా.. అనుమానాలు కలుగుతున్నాయి.

## బిగ్ అలర్ట్.. వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లలో అలాంటి పోస్టులు పెడుతున్నారా..

**కారేపల్లి,తెలంగాణ దిశ :**సోషల్‌మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేష పూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని కారేపల్లిఎస్సై బి.గోపి ఓ ప్రకటనలో హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల పై శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలోపోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరం గా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్య మాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు. ఏదైనా వర్గాన్ని కించపరచేలా తెలియని సమాచా రాన్ని పోస్ట్ చేయడం, షేర్ చేయడం నేరంగా పరిగణించబడుతుం దన్నారు. ఏ గ్రూపులోనై ఇలాంటి పోస్టులు షేర్ అయితే, ఆగ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడిగా పరిగణిస్తామ నితెలిపారు. పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

## మళ్లీ మొదటికొచ్చిన రాజీనామాలు..!

**ఏలూరు,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో రాజీనామాల వ్యవహారం ఒక అంతులేని న్యాయ పోరాటంగా మారుతోంది. తమ రాజీనామా లను ఆమోదించాలంటూ పలువురు ఎమ్మెల్సీలు కోరుతుండగా, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తీసుకుంటున్న నిర్ణయాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. హైకోర్టు సింగిల్ బెంచ్ గడువు విధించడంతో ఈ వివాదానికి తెరపడుతుందని భావించిన తరుణంలో, ఛైర్మన్ అనూహ్యంగా అప్పీల్ దాఖలు చేయడం ద్వారా ఈ ఎపిసోడ్‌కు కొత్త ట్విస్ట్ ఇచ్చారు. దీంతో ఇప్పట్లో రాజీనామాల ఆమోదం ఉండకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. దాదాపు ఏడాది క్రితం ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన జయమంగళ వెంకట రమణ తదితరులు, తమ లేఖలను ఛైర్మన్ ఆమోదించడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ బెంచ్, నాలుగు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు మోషేన్ రాజు రాజీనామా చేసిన సభ్యులను పిలిపించి, వారి వివరణ తీసుకు న్నారు. దీంతోరాజీనామాల ఆమోదంలాంఛనమే అనిఅంతా భావించారు కానీ, ఇక్కడే అసలు కథ మొదలైంది. స్పీకర్ లేదా ఛైర్మన్ నిర్ణయాధికారాల్లో న్యాయస్థానాలు కాలపరిమితిని విధించలేవ న్న వాదనతో మోషేన్ రాజు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన వేసిన ఈ పిటిషన్, రాజీనామాల ప్రక్రియను మళ్లీ నిలిపివేసింది.

ఫిరాయిం పుల చట్టం లేదా రాజీనామాల ఆమోదం విషయంలో అసెంబ్లీ స్పీకర్ లేదా మండలి ఛైర్మన్‌కు ఉండే విశేష అధికారాలుంటాయి. అయితే వాళ్లు నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా జాప్యం చేస్తుంటే న్యాయ స్థానాల జోక్యం చేసుకోవడం మరో అంశం. గతంలో సుప్రీంకోర్టు నిర్ణీత గడువులోగా శాసనసభాధిపతులు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అయితే, తన పరిధిలోని అంశాల్లో కోర్టు గడువు విధించడం సరికాదన్నది ఛైర్మన్ వాదనగా కనిపిస్తోంది.

# బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కు త్వరలో కార్యరూపం



## హైదరాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** చెన్నై- హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది. తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది.సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు.

.ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు. దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌గా ఉంది. భూసేకరణపై జాప్యాన్ని నివారించేందుకు త్వరగా స్థలాల ఖరారు చేయాలని రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

# కుప్పం, హిందూపురంలు రెండింటి అడ్డా

**తిరుపతి,తెలంగాణ దిశ :** తెలుగుదేశం పార్టీ ఏర్పాటయి దాదాపు నలభై రెండేళ్లయింది. అయితే ఈ రెండేళ్లలో అస్సలు ఓటమి ఎరుగని నియోజకవర్గాలు ఆంధ్రప్రదేశ్ లో రెండే రెండు ఉన్నాయి. ఒకటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం ఒకటి కాగా, మరొకటి నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం మరొకటి. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓటమి అనేది తెలుగుదేశం పార్టీకి లేదు. ఇతర పార్టీలకు ఇక్కడి ప్రజలు గెలుపు అవకాశం ఇవ్వలేదు. అభ్యర్థులు ఎందరిని మార్చినా.. పార్టీలు అనేకం పుట్టుకొచ్చినా ఈ రెండు నియోజకవర్గాల్లో మాత్రం పసుపు జెండా నాలుగు దశాబ్దాల నుంచి ఎగురుతూనే ఉంది. అలాగే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రానప్పుడు కూడా ఇక్కడ టీడీపీ జెండా మాత్రం గెలుస్తూనే ఉంది. దీంతో పాటు ఇచ్ఛాపురం, ఉండి నియోజకవర్గాలకు కూడా అదే ట్రాక్ రికార్డు ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ పది సార్లు ఎన్నికలు జరిగితే ఇప్పటి వరకూ 9 సార్లు ఉండి, ఇచ్ఛాపురంలో టీడీపీ అభ్యర్థులను అక్కడి ప్రజలు గెలిపించుకున్నారు. కుప్పం నియోజకవర్గంలో 1983, 1985 ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం నుంచి ఎన్.రంగస్వామి నాయుడు గెలిచారు. ఇక 1989లో చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోకి అడుగు పెట్టారు. 989, 1994, 1999, 2004, 2009, 2014, 2019, 2024 ఎన్నికలలో చంద్రబాబు నాయుడు గెలిచారు. మెజారిటీ కూడా పెద్దగా మార్పులేకుండా గెలిచారు. కర్ణాటక, తమిళనాడుకు సమీపంలో ఉన్న ఈ నియోజకవర్గం చంద్రబాబుకు అడ్డాగా మారింది. ఇక ఇక్కడ ఎవరు పోటీ చేసినా ఓడి పోవడం ఖాయంగానే భావించి బరిలోకి దిగాల్సి వస్తుంది. అందులోనూ చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నిక కావడంతో ఇక కుప్పం నియోజకవర్గం చంద్రబాబుకు, టీడీపీకి కేరాఫ్ గా మారింది.

హిందూపురం నియోజకవర్గం కూడా అంతే. ఈ నియోజకవర్గం కర్ణాటక సరిహద్దుల్లో ఉంది. టీడీపీ ఏర్పాటయిన పదకొండు ఎన్నికల్లో టీడీపీయే గెలిచింది. 1983లో రంగనాయకులు, 1985, 1994లోనందమూరి తారక రామారావు, 1996లో నందమూరి హరికృష్ణ, 1999లో వెంకటరాముడు, 2004లో పి. రంగనాయకులు, 2009లో అబ్దుల్ ఘని, 2014, 2019, 2024లో నందమూరి బాలకృష్ణ వరసగా హ్యాట్రిక్ విజయాలను సాధించి నందమూరి సొంత నియోజకవర్గంగా మార్చుకున్నారు. వైసీపీ ఎన్ని ప్రయోగాలు చేసినా ఇక్కడ గెలుపు మాత్రం చిక్కడం లేదు.

# విజయసాయిరెడ్డి పార్టీ అడుగులు

**నెల్లూరు,తెలంగాణ దిశ :** రాజకీయ పార్టీ పెట్టడం సులువే. కానీ దానిని నడపటమే కష్టం. రాజీనామా చేసినంత సులువు కాదు.. పార్టీని నడపటం. అలాగే ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ వాక్యూమ్ లేదు. అలాంటి చోట మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ పెట్టి ఏం చేయాలని భావిస్తు న్నారన్నది అర్థం కాకుండా ఉంది. గతంలోనూ విజయసాయిరెడ్డి మీడియా ఛానల్ ను పెడతానని ప్రకటించారు. తాజాగా రాజకీయ పార్టీని పెడతానని చెప్పారు. అయితే రాజకీయ పార్టీ నడపాలంటే కేవలం పేరు రిజిస్ట్రేషన్ చేస్తేనే సరిపోదు. దానికి కావాల్సిన అంగ, అర్థ బలాలుండాలి. కొత్త పార్టీ పెట్టి గతంలో అనేక మంది చేతులు కాల్చుకున్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా కొందరు గుర్తు చేస్తున్నారు.ఏపీలో మరొక కొత్త పార్టీ అవసరమా అన్న చర్చ కూడా విజయసాయిరెడ్డి వ్యాఖ్యల తర్వాత నడుస్తుంది. వైసీపీకి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి కూడా వదులుకున్నారు. ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. విజయ సాయిరెడ్డి మాత్రం ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలో చేరే ఉద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. అవసరం వస్తే పార్టీ ఏర్పాటు చేయడానికీ వెనకాడనని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ పరాజయం తర్వాత పార్టీకి రాజీనామా చేయడానికి కారణాలు ఈ సందర్భంగా వెల్లడించారు. పలు వర్గాల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చినా దానికి లొంగలేదని చెప్పారు. జగన్ చుట్టూ ఉన్న కొంత మంది తప్పుదారి పట్టించడంతో పరిస్థితి మారిపోయిందని వ్యాఖ్యానించారు. కట్టుబాటు లేని వారి మాటలు నమ్మొద్దని జగన్‌కు సూచించినట్లు చెప్పారు. విజయసాయిరెడ్డి తాను రాజీనామా చేసిన తర్వాత రైతుగా మారాలను కున్నానని, తాను వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్ నని గుర్తుచేశారు. ఏ పార్టీ నుంచి ఆహ్వానం రాలేదని, తాను వెళ్లే ఉద్దేశ్యమూ లేదని తెలిపారు. అయితే పరిస్థితులు బలవంతం చేస్తే పార్టీ ఏర్పాటు చేయ డానికి కూడా సిద్ధమేనని చెప్పారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో రెండు దశాబ్దాల స్నేహం ఉందని, ఆయనపై ఎప్పుడూ విమర్శలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయనని విజయసాయిరెడ్డి అన్నారు. అయితే విజయసాయిరెడ్డి తాను పార్టీ పెట్టినా రాజకీయంగా ఏ మేరకు నిలదొక్కుకుంటారు లేక పవన్‌తో సత్సంబంధాలున్న కారణంతో జనసేనలో చేరతారా అన్నది త్వరలోనే తేలనుంది.

# కొత్త జిల్లాలు... కొత్త మండలాలు..

**విజయవాడ,తెలంగాణ దిశ :** పీలో కొత్తగా మరో మూడు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. అనంతరం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా, మదనపల్లె, మార్కాపురం జిల్లాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అలాగే అద్దంకి, పీలేరు, బనగానపల్లె, మడకశిర, నక్కపల్లి రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో మూడు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాల ఏర్పాటుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. కేబినెట్ సబ్ కమిటీ సమర్పించిన నివేదికపైనా చర్చించారు. ఈ క్రమంలోనే ఏపీలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే ముందుగా ప్రచారంలో ఉన్నట్లుగానే మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.మరోవైపు ఏపీలో కొత్తగా మరో ఐదు రెవెన్యూ డివిజన్లు కూడా ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రతిపాదనకు కూడా సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసే మదనపల్లె జిల్లాలో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. నంద్యాల జిల్లాలో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. వీటితో పాటుగా కర్నూలు జిల్లాలోని ఆదోని మండలం విభజించేందుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆదోని మండలం విభజించి పెద్దహరివనాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడుతోమంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ వివిధ ప్రాంతాలలో పర్యటించి అభిప్రాయాలను తెలుసుకుంది. అనంతరం నివేదిక తయారు చేసిన మంత్రుల కమిటీ ఏపీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికపై సీఎం చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా కసరత్తు చేశారు. అనంతరం మార్కాపురం ప్రజల చిరకాల కోరికను నెరవేరిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుచేసేందుకు అంగీకరించారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉన్న మదనపల్లెను కొత్త జిల్లాగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు చంద్రబాబు పచ్చజెండా ఊపారు.

# భారీగా పడిన కొబ్బరికాయల ధరలు



**కాకినాడ,తెలంగాణ దిశ :** కొబ్బరికాయలు ధరలు పెరగడంతో రైతులు, వ్యాపారులు ఆనందంలో మునిగిపోయారు. గత నాలుగు- ఐదు నెలలుగా పెరిగిన ధరలు కొనసాగాయి. అయితే గత కొద్ది రోజులుగా ధరలు పడిపోతున్నాయి. 1000 కొబ్బరికాయలకు గతంలో రూ. 26 వేలు పలుకగా.. ఇప్పుడు రూ. 10 వేలకు వచ్చింది. దీంతో ధర మరింత తగ్గుతుందేమోనని రైతులు, వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. కాగా, పండుగలు లేకపోవడం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి పెరగడం వంటి కారణాలతో ధరలు తగ్గాయని చెబుతున్నారు.గత కొద్దికాలంగా కొబ్బరి ధరలు పెరుగుతూ వచ్చాయి. దీంతో కొబ్బరి రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి పెరుగుదల కనిపించింది. వెయ్యి కొబ్బరికాయలకు రూ. 26 వేల వరకు ధర పలికింది. కొబ్బరి రైతులకు కాసుల వర్షం కురిపించింది. ఇటీవల కొబ్బరికాయల ధరలు పెరగడంతో వ్యాపారులు కూడా సంతోషించారు. పెరిగిన ధరలు సుమారు 4 నెలలు కొనసాగాయి. అయితే గత కొద్ది రోజులుగా కొబ్బరి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో రైతులు, వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది.కాగా, ధర పెరిగిందని.. వ్యాపారులు కూడా లక్షల్లో కొబ్బరి నిల్వ కాయలను కొనుగోలు చేసి నిల్వ చేశారు. ఈ క్రమంలో కొబ్బరి వెయ్యి కాయలు దాదాపు రూ. 10 వేలు మాత్రమే పలుకుతున్నాయి. ధర పతనం కావడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఒకేసారి కొబ్బరి ధర ఇంతలా పతనం కావడం ఎప్పుడూ జరగలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.కొబ్బరి ధరలు పడిపోవడానికి కొన్ని కారణాలను చెబుతున్నారు. ప్రస్తుతం ఎటువంటి పండుగలు కూడా లేకపోవడంతో కొబ్బరికి డిమాండ్ కూడా తగ్గింది. అంతేకాకుండా కర్ణాటక వంటి రాష్ట్రాల నుంచి కొబ్బరి ఎగుమతి ఎక్కువ ఉంది. దీంతో కొబ్బరి ధర పతనమైందని చెబుతున్నారు. కాగా, ధర పెరిగితేనే తాము నష్టాల నుంచి బయటపడతామని వ్యాపారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొబ్బరి ధరలు మరింత తగ్గుతాయేమోననిఆందోళన చెందుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే కొబ్బరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఈ రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 1.8లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. అయితే అందులో ఒక్క కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. గతేడాది నుంచి కొబ్బరి ధర రూ. 10 వేలకు తగ్గడం లేదు. పచ్చికాయలతో పాటు నిల్వ కొబ్బరి కాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్ మినహా మిగిలిన దక్షిణాది రాష్ట్రాలైనా తమిళనాడు, కర్ణాటక, కేరళలలో కొబ్బరి కాయల దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఇది కాస్త ఆంధ్రాకొబ్బరి రైతులకు కలిసొచ్చింది. దీంతో జూన్- జులై సమయంలో ధర రూ. 22 వేలు పలికింది.ఇక లంక గ్రామాల్లో అయితే.. వెయ్యి కొబ్బరి కాయల ధర రూ. 23 వేల వరకూ పలికింది. కానీ ఇప్పుడు కొబ్బరి ధర రూ. 10 వేల దగ్గర కదలాడుతోంది.

# మేడారం మహా జాతరను సమన్వయంతో విజయవంతం చేద్దాం

## జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్




**ములుగు,తెలంగాణ దిశ :** వచ్చే ఏడాది జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మహా మేడారం జాతరను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, జిల్లా యంత్రాంగంతో కలసి సమన్వయంగా విజయవంతం చేద్దామని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. గత జాతర సందర్భంగా జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అందరితో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో సమన్వయ కమిటీ సమావేశం ఓ ఎస్ డి శివం ఉపాధ్యాయ, డి.ఎస్.పి రవీందర్ లతో కలిసి జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ ఆర్ కేకన్ మాట్లాడుతూ రానున్న మహా జాతరకు కోటి 50 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడానికి పదివేల మంది పోలీస్ సిబ్బంది నియమిస్తున్నామని, మేడారంలోని అమ్మవార్ల గద్దెల వద్ద మాస్టర్ ప్లాన్ తో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి అందరికీ ఒకే నిబంధనలు ఉంటాయని, 99 శాతం ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుందామని తెలిపారు. గతంలో రెండు జాతర సందర్భంగా పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నానని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అమ్మవార్లను దర్శించుకోవడానికి గతంలో ఉన్న క్యూలైన్లకు అదనంగా మరో ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 8 క్యూ లైన్ ల ద్వారా భక్తులను అమ్మవార్ల దర్శనం కోసం అనుమతించి మూడు గేట్ల ద్వారా బయటికి పంపించడం జరుగుతుందని, జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకునే నిర్ణయాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు




చేయబోతున్నామని, ప్రత్యేక నినాదంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా భక్తులకు వివరించడం జరుగుతుందని అన్నారు. జాతర సందర్భంగా ఇతర సమయాలలో పలు రకాల వాహనాలు వేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ములుగు జిల్లాలో గంజాయి అమ్మకాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయబోతున్నామని, చెడు వ్యసనాలపై యువకులకు అవగాహన కలిగించడానికి కళాబృందాలచే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. అక్రమంగా ఇసుక, ఎర్ర మట్టి, ఇతర వస్తువులను అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని, పలు రకాల పశువులు జాతీయ రహదారిపై రాకుండా వాటికి సంబంధించిన యజమానులకు ముందు సమాచారం అందించి వినని పక్షంలో పశువులను గోశాలకు తరలిస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ములుగు జిల్లాలో పలు రకాల పనులు చేయడానికి వచ్చిన సందర్భంలో వారి వివరాలను పూర్తిగా సేకరించాలని, దీంతో పలు సంఘటనలు చోటు చేసుకోకుండా అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మేడారం జాతర సందర్భంగా పాత్రికేయులు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి ఆలోచిస్తామని, జాతర విషయంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. ఎలాంటి సంఘటనలు జరిగిన తన దృష్టి కానీ ఇతర అధికారులు దృష్టి గానీ తీసుకపోవాలని, ప్రతి విషయాన్ని భూతద్దంలో చూపించకుండా సమస్య పరిష్కారం కోసం పాత్రికేయులు సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు.

# ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు

## పోటీలను ప్రారంభించిన కలెక్టర్



**కరీంనగర్,తెలంగాణ దిశ :** మహిళలు, పిల్లలు, వికలాంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు కరీంనగర్ లోనిడాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈకార్యక్రమానికి హాజరై పలు ఆటల పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశా రు. చెస్, క్యారం, రన్నింగ్, షార్ట్ పుట్, జావలిన్ త్రో వంటి పోటీల్లో విభాగాల వారీగా అంధులు, బధిరులు, శారీరక, మానసిక దివ్యాంగులు తమ ప్రతిభను చాటారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల మానసిక వికాసానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి మాట్లాడుతూ వచ్చేనెల మూడవ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున పంపించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధి శివ కాంత్, రెడ్ క్రాస్ సోసైటీ అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు వెన్నం శ్రీనివాస్, మొగిలి లక్ష్మణ్, కె. నర్సయ్య, వై. సురేష్, రాజశేఖర్ రెడ్డి, ప్రభుత్వ అంధుల, బధిరుల, మానసిక పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.



# అన్నదాతను ఆదుకోవాలి

"రైతు దు:ఖిస్తే రాజ్యం వర్ధిల్లదు" అని పెద్దలు అంటారు. కానీ, మనదేశంలో రైతు కన్నీరు పెట్టుకోని రోజే లేకుండాపోయింది. బలవంతపు భూసేకరణలు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు మద్దతు ధర దక్కని పరిస్థితులు అన్నదాతను నిత్యం అవస్థల పాలు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది మన రాష్ట్రంలో ఖరీఫ్‌లో యూరియా కొరత దగ్గర నుంచి ప్రతి పంట కాలంలోనూ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మామిడి, బర్లీ పొగాకు, మిరప, పత్తి, ఉల్లి, చెరుకు, మొక్కజొన్న, టమాటా, ధాన్యం, తాజాగా అరటి రైతులు పెట్టుబడి కూడా తిరిగి చేతికి రాకపోవటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రతి ఏటా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమవుతున్నా- రైతాంగాన్ని ఆదుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక చేపట్టకపోవటం విచారకరం. సమస్య ముందుకొచ్చినప్పుడు సానుభూతి చూపించటం, ఏవో కొన్ని ఉపశమన చర్యలు తీసుకోవటంతోనే పాలకులు చేతులు దులుపు కోవటం శోచనీయం. సంపన్నులైనా సామాన్యులైనా బతకటానికి అన్నం తినాల్సిందే! అలాంటి ఆహారాన్ని ఆరుగాలం శ్రమించి దేశానికి అందించేది రైతులు, వ్యవసాయ కార్మికులు. ఇంత కీలకమైన ఆహారోత్పత్తిని సాధిస్తున్న వ్యవసాయరంగం పట్ల పాలకులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలి. ఆసరా అందించాలి. దురదృష్టవశా త్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటిలోనూ అలాంటి స్పృహ లోపించింది. ఎరువులు, విత్తనాలపై ఇచ్చే రాయితీలకు ఏటేటా దిగ్గోత కొనసాగుతోంది. పోనీ, అధిక ధరలకిచ్చే ఎరువులు, విత్తనాలనైనా సకాలంలో సమకూర్చుతున్నారా అంటే అదీ లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో యూరియా కొరతతో విలవిల్లాడిన రైతులు పోలీసు లాఠీలను కూడా రుచి చూడాల్సి వచ్చింది. తోతాపురి మామిడి ధర దారుణంగా పడిపోయింది. ఆ తరువాత ఉల్లి పంటకూ అదే పరిస్థితి! మార్కెట్టుకు తెచ్చిన పంట అమ్ముడుపోక, నిరాశ చెందిన రైతులు దానిని రోడ్లపైనే పారబోసి, నిరసన వ్యక్తం చేసిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. వీటికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో అమలు కాకుండానే పోయింది. ఆశలు కల్పించి సాగులోకి దించిన పొగాకు కంపెనీలు ఆ తరువాత పంటను కొనకుండా చేతులెత్తేసినా, రాష్ట్ర ప్రభుత్వం కిమ్మనలేదు. కోసిన కూలి కూడా రానంత స్థాయికి ధర దిగజారిపోయి టమాటా రైతులు కూడా కన్నీరు పెట్టుకున్నారు. లక్షల రూపాయల పెట్టుబడిని నష్టపోయామని నెత్తీనోరూ కొట్టుకున్నా పాలకుల చెవికెక్కింది లేదు. ఇప్పుడు రిటైల్ మార్కెట్లో అరటి ధర బాగానే ఉన్నా %-% రైతుల దగ్గర మాత్రం కొనుగోలు ధర కుప్పకూలిపోయింది! పంటలకు ప్రభుత్వం నుంచి కనీస ధర మద్దతు, మార్కెట్లో పర్యవేక్షణ, జోక్యమూ ఉంటే ఇలాంటి దుస్థితి దాపురించదు. దళారుల దయాదాక్షిణ్యాల మీద, మార్కెట్ శక్తుల మాయోపాయాల మీద వదిలిస్తే- దిగుబడులు ముమ్మరంగా ఉన్న వేళ ధరల తగ్గింపు నాటకాలు యథేచ్ఛగా సాగుతూ ఉంటాయి. ఒక వేళ నిజంగానే మార్కెట్టు ఒడిదుడుకులకు గురైనా రైతు పడిపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. తగినంతస్థాయిలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. ఇరవై ఏళ్ల క్రితమే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. సి2ప్లస్ 50ఫార్ములా ఉన్నంతలో రైతులను కష్టాల ఊబిలో నుంచి బయటకు తేగలిగిన ఆచరణీయ సిఫార్సు. దానిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వైపరీత్యాలకు, పాలకుల అరిష్టాలకు ఎదురొడ్డి సాగుతున్న మన వ్యవసాయ రంగంలోకి చొచ్చుకురావాలని అమెరికా కార్పొరేటు కంపెనీలు ఎన్నేళ్ళ నుంచో కాచుక్కూచున్నాయి. అన్నదాతల గురించి ఒకపక్క మొసలి కన్నీరు కారుస్తూనే- మరోపక్క కార్పొరేట్లకు తాకట్టు పెట్టే కుటిల యత్నాలను బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తూ ఉంది. పత్తి దిగుమతి అంశంలో మోడీ సర్కారు లొంగుబాటు మన రైతుల కష్టాలను పెంచబోతోంది. ట్రంపు ఒత్తిళ్లకు తలొగ్గి, వ్యవసాయ రంగంలో చేసుకుంటున్న ఒప్పందాలు భారత రైతాంగానికి వెన్ను విరుపే అవుతుంది. భారత రైతాంగమూ, వారి శ్రేయస్సును కోరుకునే ప్రజలూ ఐక్యంగా రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి. పంటలను, రైతులను మార్కెట్ల గాలికి వదిలేయకుండా తగు రక్షణ, భరోసా కల్పించేలా పాలకులపై ఒత్తిడి తేవాలి.

# విల్లాల కల్చర్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్ మహానగరం నలువైపులా విస్తరిస్తోంది. భారీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్స్‌లో హైరైజ్ బిల్డింగ్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. కోకాపేట, నానక్ రాంగూడ, నార్సింగి, గచ్చిబౌలి ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. రాయదుర్గంలో ఎకరా 177 కోట్ల రూపాయలు పలికింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతమంతా అద్దాల మేడలతో రంగుల ప్రపంచంగా మారిపోయింది. విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది. కాస్ట్లీ ఏరియాలో లగ్జరీ అపార్ట్‌మెంట్స్ కు భారీగా డిమాండ్ ఉంది. టెకీలు.. తమ కార్యాలయాలకు దగ్గరలో ఉండే విధంగా ఇళ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉండటం, ఆఫీస్‌కు దగ్గరలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌కు క్రేజ్ పెరిగిందని.. దీంతో వీటి అమ్మకాల సంఖ్య పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.మరోవైపు విల్లాల కల్చర్ కూడా పెరిగిపోయింది. విల్లా అనేది స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే పది కోట్ల రూపాయల వరకు వెచ్చించి విల్లాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కనెక్టివిటీ ఉంటే చాలు ఎంత దూరమైన వెళ్లి విల్లా కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. కాలుష్య భూతానికి దూరంగా విల్లాల్లో విలాసవంతంగా జీవించేందుకు హైదరాబాదీలు మక్కువ చూపిస్తున్నారు. ఆఫీస్‌లకు దగ్గరగా ఉండాలని కోరుకునేవారు తప్పనిసరి పరిస్థితుల్లో లగ్జరీ అపార్ట్‌మెంట్స్ చూస్తున్నారు. శంషాబాద్, కిస్మత్‌పూర్, కొంపల్లి ప్రాంతాల్లో విల్లాల నిర్మాణాలు పెరిగిపోయాయి. డిమాండ్ మేరకే నిర్మాణాలు కొనసాగుతున్నాయని రియాల్టర్లు చెబుతున్నారు. విల్లాలు, అపార్ట్‌మెంట్స్ అమ్మకాల్లో దేని డిమాండ్ దానికే ఉందని నిపుణులు చెబుతున్నారు.

# బిజెపికి టాటా భారీ విరాళం

## తెర వెనుక జరిగిందేమిటి

న్యూఢిల్లీ : సెమీ కండక్టర్ యూనిట్లకు మోడీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిన వారాల వ్యవధిలోనే టాటా గ్రూపు బిజెపికి భారీ మొత్తంలో విరాళాలను అందచేసింది. ఈ మొత్తం రూ.758కోట్లుగా వుంది. ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ఆధారంగా చూసినట్లైతే 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీకి అతిపెద్ద మొత్తంలో విరాళాలిచ్చిన గ్రూపుగా టాటా గ్రూపు నిలిచింది.

ఇదంతా ఎలా సాధ్యమైందంటే దేశీయంగా సెమీకండక్టర్ పరిశ్రమ నిర్మాణానికి ఊతమివ్వడంలో భాగంగా మూడు సెమీ కండక్టర్ యూనిట్లకు మోడీ ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 29న ఆమోద ముద్ర వేసింది. అందులో రెండు యూనిట్లకు టాటా గ్రూపు నేతృత్వం వహిస్తోంది. సెమీ కండక్టర్ ఉత్పత్తిని దేశంలో పెంచేందుకు గానూ వాటికి కొంత మొత్తంలో రాయితీలు ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అందులో భాగంగా ఈ యూనిట్ల నిర్మాణంలో సగం భాగాన్ని భరించేందుకు కేంద్రం అంగకరించింది. ఆ విధంగా టాటా గ్రూపు నిర్మించబోయే రెండు యూనిట్లకు వచ్చే సబ్సిడీ ఏకంగా రూ44,203కోట్ల వరకు వుంది. అంతే కేబినెట్ సమావేశం జరిగి నాలుగు వారాలు తిరిగేసరికల్లా బిజెపికి అతిపెద్ద డోనార్‌గా టాటా గ్రూపు ఆవిర్భవించింది. రూ.758కోట్లను పార్టీకి విరాళంగా అందచేసింది. 2023-24లో రాజకీయ పార్టీలకు వచ్చిన విరాళాలన్నింటినీ అధిగమించి బిజెపి అగ్ర భాగంలో నిలిచింది. 2024-25లో మొత్తంగా టాటా గ్రూపునకు చెందిన 15 సంస్థలు దాదాపు రూ.915కోట్ల మొత్తాలను రాజకీయ విరాళాలుగా అందచేశాయి. టాటా గ్రూపు ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు ద్వారా రాజకీయ పార్టీలకు ఈ విరాళాలు బదిలీ అవుతాయి.

అన్నింటిలోకి టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అత్యధికంగా రూ.308కోట్లు అందచేసింది. 2021 నుండి 2024 వరకు రాజకీయ పార్టీలకు ఎలాంటి విరాళాలను టాటా ట్రస్టు ఇవ్వలేదు. కేవలం లోక్‌సభ ఎన్నికలకు రోజుల వ్యవధి ముందుగా అంటే గతేడాది ఏప్రిల్‌లో రూ.758కోట్లను బదిలీ చేసింది.




బిజెపి తర్వాత అధికంగా విరాళాలు అందుకున్నది కాంగ్రెస్ పార్టీనే. ఈపార్టీకి రూ.77.3కోట్లు వచ్చాయి. అంటే బిజెపి అందుకున్న దాంట్లో దాదాపు పదో వంతు. మరో 8 రాజకీయ పార్టీలు రూ.10కోట్లు చొప్పున ఈ గ్రూపు నుండి విరాళాలు అందుకున్నాయి. వాటిల్లో తృణమూల్, డిఎంకె, శివసేన, బిజూ జనతాదళ్, వైఎస్ఆర్ కాంగ్రెస్, జనతాదళ్(యునైటెడ్), లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్ ), భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వున్నాయి.ఇక తమిళనాడుకు చెందిన మురుగప్ప గ్రూపు మూడో కండక్టర్ యూనిట్‌ను పొందింది. ఉత్పత్తి వ్యయంలో 50శాతాన్ని కేంద్రం భరించడంలో భాగంగా ఈ సంస్థకు రూ.3501 కోట్లు సబ్సిడీగా వచ్చాయి దాంతో కొద్ది రోజుల వ్యవధిలోనే బిజెపికి మురుగప్ప గ్రూపు రూ.125కోట్లు విరాళంగా ఇచ్చిందని వెల్లడైంది. ఈ ఏడాది ప్రారంభంలో స్క్రోల్ ఇన్ వెబ్‌సైట్ పేర్కొంది. కేన్స్ టెక్నాలజీకి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ కన్ని కన్నన్ కూడా 2024-24లో రూ.12కోట్లు విరాళంగా ఇచ్చినట్లు పార్టీ కాంట్రిబ్యూషన్ రిపోర్టు తెలిపింది. గుజరాత్‌లోని సంసద్‌లో సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేన్స్ సంస్థ అయిన సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో అనుమతి లభించింది. బిజెపికి అందిన విరాళాల సమయంపై అటు టాటా గ్రూపునకు ఇటు కేంద్రానికి స్క్రోల్ గ్రూపు ప్రశ్నలు సంధించినా ఇప్పటివరకు ఎవరి నుండి ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం అందచేసిన సమాచారం ప్రకారం టాటా గ్రూపు ఈరెండు యూనిట్లపై రూ.1.18 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 46వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించనుంది.

# జగనన్న ప్రభల తీర్థానికి గుర్తింపు

**కాకినాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమ్మతి తెలిపారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవానికి రాష్ట్ర పండుగగా ప్రకటిస్తే.. కోనసీమ ప్రాంత ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుంది.ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలలో జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక స్థానం ఉంది. వందల ఏళ్లుగా తెలుగు సంస్కృతికి చిహ్నంగా ఈ పండుగ నిలుస్తోంది. అయితే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబు సమ్మతించారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు మలికిపురం గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానికులు వినతిపత్రం అందించారు.స్థానికుల వినతిపై స్పందించిన మంత్రి దుర్గేష్.. లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహించే ఈ ప్రభల తీర్థానికి 450 సంవత్సరాల ఘనచరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు కూడా సమ్మతి తెలిపారన్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ఏటా సంక్రాంతి పర్వదినాల్లో.. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తారు. పంట కాలువల సవ్వడి నడుమ సంక్రాంతి కనుమ రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. దాదాపు 450 ఏళ్లు చరిత్ర కలిగిన ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ప్రజలు ఎప్పటినుంచో ఆకాంక్షిస్తున్నారు. దేశం మొత్తంలో.. ఏకాదశరుద్రులు ఒకేచోట కొలువుతీరేది జగ్గన్నతోట ప్రభల ఉత్సవంలోనే. రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన ప్రభలు అంబాజీపేట మండలంలోనే తయారు చేస్తారు.ఈ జగ్గన్నతోట ప్రభల ఉత్సవం విశిష్టత గురించి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు రాసిన లేఖల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ తెలుసుకున్నారు. అనంతరం ప్రధాని 2020లో తన సందేశాన్ని పంపించారు. 2023లో ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలో జగ్గన్నతోట ప్రభల తీర్థం శకటాన్ని ప్రదర్శించారు. ఈ ప్రభల గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. ఈ ఏడాది పర్యాటకశాఖ ఈవెంట్స్-ఫెస్టివల్ వెబ్‌సైట్‌లో ఈ ఉత్సవం చోటు దక్కించుకోవడం గమనార్హం. అంతేకాకుండా పదోతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో.. జగ్గన్నతోట ప్రభల తీర్థం ప్రాధాన్యత, ప్రాచుర్యాన్ని వివరించారు.జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్రపండుగగా గుర్తిస్తే.. కోనసీమ ప్రాంతం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు దక్కుతుంది. పర్యాటకులు కూడా ఎక్కువ సంఖ్యలో రావడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఇక రాష్ట్ర పండుగగా గుర్తిస్తే.. ఈ ఉత్సవం మరింత వైభవంగా జరపడానికి.. ఉత్సవానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. అంతేకాకుండా పదకొండు గ్రామాల్లో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ఆలయాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు.. ఆలయాల వద్ద ప్రధానంగా తాగునీరు, వైద్యశిబిరాలు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయొచ్చు.

# ఢిల్లీ పోలీసుల ఆపరేషన్...

న్యూఢిల్లీ, : భారత్‌లో అల్లర్లు, దాడులు చేసేందుకు పాకిస్తాన్ సకల ప్రయత్నాలు చేస్తోంది. మన నిఘా వర్గాలు, పోలీసులు, సైన్యం ఈ కుట్రలను 99శాతం పసిగడుతున్నాయి. ఒకటి రెండు మాత్రం మిస్ అవుతున్నాయి.అలాంటి సమయంలో పహల్గాం దాడి, తాజాగా ఢిల్లీ పేలుడు ఘటన జరిగాయి. ఢిల్లీ ఘటన తర్వాత పోలీసులు తాజాగా సోదాలు విస్తృతం చేశారు. ఈ తనిఖీల్లో అంతర్జాతీయ ఆయుధ సరఫరా ముఠాను పట్టుకున్నారు.ఢిల్లీ పోలీసులు పాకిస్తాన్ ఐఎస్ఐకి సంబంధిన ఆయుధాలను డ్రోన్ల ద్వారా భారత్‌లోకి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఈ ముఠా అధునాతన టర్కీ తయారీ జులీ 5.7, చైనా తయారీ జూలీ 3 పిస్టళ్లు, 92 రౌండ్లను స్వాధీనం చేసుకున్నారు. విభాగం పరిశోధనల ప్రకారం, ఈ ముఠా డ్రోన్లను అతి తక్కువ ఎత్తులో ఎగిరిస్తూ పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో జీపీఎస్ సూచించిన ప్రదేశాల వద్ద ఆయుధాలను డ్రాప్ చేస్తూ, స్థానిక ముఠాలకు అందేలా చేస్తోంది. ఆయుధాలు దొరికిన తరువాత, వీటిని క్రిమినల్లు, హత్యల, దోపిడీల కోసం ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది.ఈ ఆయుధ ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. మణిదీప్ సింగ్, దల్వీందర్, రోహన్ తోమర్, అజయ్ అలియాస్ మోను ను అరెస్టు చేశారు. వీరు పంజాబ్, ఉత్తరప్రదేశ్ వాసులుగా, పంజాబ్ యూఎస్ క్రిమినల్ గ్యాంగ్స్‌కు సంబంధం ఉన్నవారు. గ్యాంగ్ నేత సోను ఖత్రి (రాజేశ్ కుమార్) ప్రస్తుతం యూఎస్‌లో ఉన్న శ్రీమంత ఆయుధ వ్యాపార చరిత్ర కలిగిన వ్యక్తి. సోను ఖత్రి ఐఎస్ఐ సహకారంతో విక్రయానికి ఆయుధాలు సరఫరా చేస్తోంది. డ్రోన్ల వినియోగం ద్వారా రాడార్ గుర్తింపు తప్పించుకుని దేశంలోకి ఆయుధాలు పంపుతున్నారు. తాజా ఘటనతో ప్రస్తుతం పోలీసులు



మరింత గట్టి చర్యలతో మిగతా కుట్రకారులను గుర్తించారు.నవంబర్ 19న పోలీసులకు సమాచారం అందింది.

రోహిణిపట్‌లోని ఖాతూశ్యాం ఆలయం వద్ద గ్యాంగ్‌ను పట్టుకున్నారు. పిస్టళ్లు, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఫిలాపూర్‌కు చెందిన మణిదీప్, లూధియానాకు చెందిన దల్వీందర్ చిన్ననాటి మిత్రులు, గ్యాంగ్‌స్టర్ జస్‌ప్రీత్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయి.

జస్‌ప్రీత్ పాక్‌లోని ఐఎస్ఐ నుంచి ఆయుధాలు భారత్‌లోకి తెప్పిస్తున్నట్లు గుర్తించారు. ఢిల్లీతోపాటు దేశంలోని పలు గ్యాంకులకు ఆయుధాలు అందించారు. ఈ గ్యాంగులు ఆయుధాలు ఉపయోగించి హత్యలు, దోపిడీలకు పాల్పడుతున్నాయి.

# ముంబైలో పాతళలోకం

## ట్రాఫిక్ కష్టాలు ఇంతింతకాదయా...

ముంబై, : ముంబై ట్రాఫిక్ కష్టాలు తీర్చే ప్రణాళికలను మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. ముంబైలో భూగర్భంలో సొరంగ మార్గాల నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టన్నెల్స్ నిర్మాణాన్ని పాతాళ లోకంగా సీఎం ఫడ్నవీస్ అభివర్ణించారు. భూమిపై ఉన్న రోడ్లకు సమాంతరంగా ఈ టన్నెల్స్ ఉంటాయని తెలిపారు. అటల్ సేతు నుంచి బాంద్రా-వర్లీ సీ లింక్ వరకు.. బాంద్రానుంచి బీకేసీ వరకు కొత్త మార్గాలు రానున్నాయిదేశ ఆర్థిక రాజధాని ముంబైలో ట్రాఫిక్ సమస్య గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే.. ముంబై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తాము రచిస్తున్న భారీ ప్రణాళికను వివరిస్తూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ముంబై అడుగున తాము ఒక పాతాళ లోకాన్ని సృష్టిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ వెబ్ సిరీస్ పేరును ఉపయోగించి దేవేంద్ర ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ముంబైలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి భూమి పైన ఉన్న రోడ్లకు సమాంతరంగా.. భూమి లోపల భారీ సొరంగ మార్గాలను నిర్మించి.. నెట్‌వర్క్ విస్తరించనున్నట్లు తెలిపారు. ముంబై అంతటా సొరంగాల విస్తృతమైన నెట్‌వర్క్‌ను సృష్టిస్తున్నామని.. ఇది ఒక రకంగా పాతాళ లోకం లాంటిదని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ముంబైలో ట్రాఫిక్ రద్దీని పూర్తిగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టన్నెల్ నెట్‌వర్క్‌కు మెట్రో కారిడార్లు అనుబంధంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

ముంబైలోకీలక ప్రాజెక్టులు: బోరివలి-గోరేగావ్: ప్రస్తుతం ఉన్న రోడ్లకుసమాంతరంగా బోరివలి-గోరేగావ్ మార్గంలో కొత్త రహదారి. వర్లీ-శివడి కనెక్టర్: వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా అటల్ సేతు నుంచి బాంద్రా-వర్లీ సీ లింక్



వరకు నాన్‌స్టాప్ ప్రయాణం.

బాంద్రా - బీకేసీ టన్నెల్: బాంద్రా నుంచి బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)వరకు ప్రతిపాదించిన సొరంగం ద్వారా ఎయిర్‌పోర్ట్ ప్రయాణంసులభం కానుంది.త్వరలో జరగనున్న బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల నేపథ్యంలో దేవేంద్ర ఫడ్నవీస్ రాజకీయ వ్యూహాలపైనా స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని నడపడానికి రెండుమార్గాలు ఉన్నాయని.. అందులో ఒకటి సిద్ధాంత మని..రెండోదిసంఖ్యాబలం అని పేర్కొన్నారు.సంఖ్యాబలం లేకుండా సిద్ధాంతాన్ని ప్రచారం చేయలేమమని.. రాజకీయాల్లో ప్రాక్టికల్‌గా ఉండాలని హితవు పలికారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన్ సురాజ్‌పార్టీ ఘోర వైఫల్యాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రశాంత్ కిషోర్ సిద్ధాంతం గురించి మాట్లాడారని.. కానీ ఆయనకు సీట్లు రాలేదని దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు.రాజకీయ వ్యవస్థ మొత్తం అవినీతిమయం అయిందని ముద్ర వేయడాన్ని తాను అంగీకరించనని సీఎంఫడ్నవీస్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని.. కానీ రాష్ట్ర స్థాయిల్లో కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని అంగీకరించారు.మాత్రాన వ్యవస్థ మొత్తం చెడ్డది అని కాదని పేర్కొన్నారు. వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ, ఉమ్మడి ప్రణాళిక ద్వారా ప్రభుత్వాన్ని నడపవచ్చని తెలిపారు.

# పత్తి రైతులపై నిబంధనల కత్తి



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నా మన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి.అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు..

ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేందప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్మగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర

ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల పక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవే టు వ్యాపారులే గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళ్లు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది. ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇతరరాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్‌తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కె ట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండింప రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందిం చి, దేవీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.



## కార్మెల్ ఉపాధ్యాయురాలికి అపూర్వ గౌరవం

**మందమర్రి,తెలంగాణ దిశ :** కార్మెల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా సేవలు అందించి వేలాది మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఓఎం మేరీ రాసిన అక్షర పదాలను పుస్తకంగా ఆవిష్కరించి రచయిత్రి కావాలి అనుకున్న ఆమె చిరకాల స్వప్నాన్ని నెరవేర్చేందుకు పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో కార్మెల్ అకాడమీ వేదికగా మారింది. మందమర్రి పట్టణం కార్మెల్ అకాడమీలో 1994 సంవత్సరంలో విద్యను అభ్యసించిన కాంచనపల్లి రజిత, 1993 బ్యాచ్ కు చెందిన బస్వపత్రుని మోహన్, 1998 విద్యా సంవత్సరానికి చెందిన నల్లాల వినయ్ రాజేంద్రప్రసాదు 1999 బ్యాచ్ విద్యార్థి వినయ్ 1996 బ్యాచ్ ఒరిజో కంపెనీ అనిల్ కుమార్ మహేష్ 1994 బ్యాచ్ విశ్వాస్ ట్రస్ట్ కళ్యాణ్ తో పాటు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓఎం మేరీ రచించిన రూట్స్ ఆఫ్ జాయ్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి అకాడమీ ఫాదర్ జీవిఆర్ రెక్స్, థామస్ నిలయాని, జోసఫ్ కున్నత్, పూర్వ ఉపాధ్యాయులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఎం మేరీ మాట్లాడుతూ రెండు సంవత్సరాలు రచించిన కథను పుస్తక రూపంలో అచ్చు వేయాలని పూర్వ విద్యార్థురాలు రజితకు తెలుపగా, మోహన్, వినయ్ రాజేంద్రప్రసాద్ ల సహకారంతో 300 పుస్తకాలు అచ్చు అయ్యాయని తెలిపారు. ఈ పుస్తకంలో కుటుంబ విలువలను, ప్రేమ అభిమానాలను తెలియజేస్తూ 12 అధ్యాయాలుగా విభజించి జీవితంలో ఆనందానికి మూలాలు కుటుంబం నుండి లభిస్తాయనే ముఖ్య అంశంతో పొందుపరిచినట్టు ఆమె వెల్లడించారు. ఉమ్మడి కుటుంబంలో పెరిగిన పిల్లలు తల్లిదండ్రుల పట్ల ప్రేమ గౌరవాలు ప్రదర్శిస్తూ, భావ స్వేచ్ఛ కలిగి, సంస్కృతిఈ సంప్రదాయాలు, పద్ధతులు నేర్చుకుంటూ ఉత్తమ బాటల వెంట ప్రయాణాలు కొనసాగించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు వద్దనుకుని వేరుగా ఉంటున్న తల్లిదండ్రులకు పిల్లల మధ్య పరస్పర అవగాహన కరువై మొబైల్ ఫోన్లకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కుటుంబం బాగుంటే సమాజంతో పాటు దేశం, ప్రపంచం బాగుంటుందని వివరించారు. ప్రతి కుటుంబంలో వృద్ధులతో కలిసి ఉంటే వారు అందించే అవగాహనతో ఆదర్శ కుటుంబంగా నిలుస్తార ని వెల్లడించారు. ఈ పుస్తక ఆవిష్కరణలో 200 మంది పైచిలుకు పూర్వ విద్యార్థులు పాల్గొనగా, ఈ పుస్తక ఆవిష్కరణ విజయవంతానికి సహాయ సహకారాలు అందించిన కార్మెల్ అకాడమీ ఫాదర్ జెవిఆర్ రెక్స్ కు పూర్వ విద్యార్థుల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్లాన్



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు 'సంకల్ప్-2026' కార్యక్రమాన్ని చేపట్టింది. 50 రోజుల ప్రణాళికతో కూడిన షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్ బాషా విడుదల చేశారు. నవంబరు 24 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. సంకల్ప్ ప్రణాళిక ప్రకారం.. రోజూఉదయం 9.10 నుంచి 12.40 గంటల వరకు అన్ని సబ్జెక్టుల్లో బోధించని అంశాల ను పూర్తి చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్, ఇతర టెస్టులు విద్యార్థులకు నిర్వహించాలి. డిసెంబరు 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహి స్తారు. ఆ తర్వాత డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు స్పెషల్ క్లాసులు ఉంటాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జూనియర్ కాలేజీల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని ఇంటర్ బోర్డు సూచించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026 మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు విద్యాశాఖ ఇటీవల షెడ్యూలు కూడా విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం పరీక్షలకు వంద రోజులు సమయం ఉంది. ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక, అక్కడ ఉన్న వసతులపై విద్యాశాఖాధికారులు పరిశీలన చేశారు. అవసరమైన చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు గతంలో కన్నా ఈ ఏడాది నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రతీరోజు తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి చదువుకోవాలి. ఏ సబ్జెక్టు అయినా రెండు లేదా మూడు భాగాలుగా విభజించుకోవాలి. పరీక్ష గడువు కాలాన్ని బట్టి కొంత సమయం రివిజన్‌కు కేటాయించి, మిగిలిన వాటిని పాఠ్యాంశాలు చదవడానికి కేటాయించాలి. రోజూ 20 నిమిషాల పాటు ధ్యానం చేయాలి. గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు చదివి సాధన చేయాలి. చదివిన ప్రశ్నలను చూడకుండా రాయాలి. వేగంగా రాసే విధానం అలవాటు చేసుకోవాలి. బిట్‌పేపరుపై నిర్లక్ష్యం వదిలి క్షుణ్ణంగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో చర్చిస్తూ అనుమానాలు నివృత్తి చేసుకోవాలి.. ఈ మేరకు కార్యచరణతో వంద రోజుల ప్రణాళికను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.

## చేతికొస్తున్నపంటలకు దక్కని మద్దతు ధరలు

**తిరుపతి,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పంట చేతికి వచ్చిన ప్రతీ సారి ఇబ్బంది పడుతున్నారు. మొదట తోతాపురి మామిడి కాయలకు డిమాండ్ లేక ఆందోళన చెందారు. తర్వాత ఉల్లి పంట పరిస్థితి అదే. ఇప్పుడు అరటి పంటలకూ డిమాండ్ ఉండటం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో తోతాపురి మామిడి రైతులు ధరలు పడిపోవడంతో రూ.1,000 కోట్ల నష్టం చవిచూశారు. సెప్టెంబర్‌లో ఉల్లి ధరలు పడిపోయి, కర్నూల్, కడప జిల్లాల్లో రైతులు పంటను పారబోశారు. ఇప్పుడు అరటి పంటలకూ అదే పరిస్థితి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 18 ముఖ్య ఆహార పంటల్లో మామిడి, ఉల్లి, అరటి ప్రధానమైనవి. 2024-25లో మామిడి పంటలు అధిక ఉత్పత్తి ధరతగ్గుబాటు కారణంగా రైతులు భారీ నష్టం చవిచూశారు. ప్రభు త్వం కొంత సాయం చేసింది. సెప్టెంబర్‌లో ఉల్లి రైతులకు అదే సమస్య వచ్చింది.ఇప్పుడు అరటి రైతులు గగ్గోలు పెడుతున్నారు. డిమాండ్,ఎగుమతులు తగ్గడం, లోకల్ మార్కెట్ స్థిరత్వం లేకపోవడం వల్ల ధర పడిపోయాయి. 2025లో ఆంధ్రలో హార్టికల్చర్ పంటలు 30 శాతం పెరిగింది. కానీ మద్దతు ధర విధానం సరిగ్గా లేకపోవడం వల్ల రైతులు లాభాలు పొందలేకపోతున్నారు.

ఫలితంగా, రైతుల ఆదాయం 40 శాతం తగ్గిందని చెబుతున్నారు. సెప్టెంబర్ 2025లో ధరల పతనంతో రూ.50,000/ హెక్టారుకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. -24,000 మంది రైతులు ప్రయోజనం పొందారు.

నవంబర్ 2025లో మార్కెట్ ధరలు మెరుగుపడ్డాయి. జూలై 2025లో కేంద్రం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ఆమోదించి తోతాపురి రైతులకు రూ.1,490 క్వింటాల్ మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్రం రూ.4 కేజీ సబ్సిడీ మొత్తం రూ.260 కోట్లు ఇచ్చింది. అక్టోబర్ 2025లో రూ.172.84 కోట్లు 37,881 మంది రైతుల అకౌంట్లలో జమ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు ప్రధానంగా ప్రయోజనం పొందారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతు పథకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించడం వంటి చర్యలు ప్రకటించింది. అరటి పంటలకు ఊఖ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామనిప్రకటించారు.

కానీ, ఇదంతా పేపర్ల మీదనే ఉన్నాయని రైతుల వరకూ వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీలు, కోల్డ్ స్టోరేజ్ సమస్యలు ఉండటంతో రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోతున్నారు. 2025లో హార్టికల్చర్ పంటలకు 1500 కోట్లు బడ్జెట్ కేటాయించినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో అమలు జరగడం లేదు. పంటలు అనూహ్యంగా ఎక్కువగా పండటం వల్ల ఇతర చోట్ల డిమాండ్ తగ్గిపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంత సాయం చేసినా రైతులు మాత్రం నష్టపోతూనే ఉన్నారు.

## 305 పరిశ్రమల మూసివేతలకు నోటీసులు!

హైదరాబాద్,తెలంగాణ దిశ : కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటించడంలో విఫలమైనం దుకు 305 పరిశ్రమలను మూసివేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశించింది. పర్యావరణ చట్టాల అమలును బలోపేతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతమైన కాలుష్య నియంత్రణను నిర్ధారించడం ఈ చర్య లక్ష్యంగా తెలుస్తోందికాలుష్య తీవ్రత ఆధారంగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్‌గా వర్గీకరిస్తుందని ృఉఖఅః అధికారులు తెలిపారు. ఈ కేటగిరీల కింద తెలంగాణలో మొత్తం 12,264 పరిశ్రమలు ఉన్నాయి. ఈ వర్గీకరణకు అనుగుణంగా ృఉఖఅః కొత్త, ఇప్పటికే ఉన్న పారిశ్రామిక యూనిట్లను నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు.జనవరి 2024 నుంచి అక్టోబర్ 2025 మధ్య బోర్డు 2,620 కొత్త కంపెనీల స్థాపనకు అనుమతులు మంజూరు చేసింది. వాయు, నీటి కాలుష్య నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని ధృవీకరించిన తర్వాత 3,521 యూనిట్లకు ఆపరేషన్ కోసం సమ్మతి (అఈూ) జారీ చేసిందిఇదే కాలంలో అధికారులు 2,069 పరిశ్రమలను తనిఖీ చేసి, కఠినమైన కాలుష్య నిర్వహణను నిర్ధారించడానికి ఉల్లంఘనలకు 1,234 యూనిట్లకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలను పాటించలేదని నిర్ధారించిన తర్వాత ఔషధ యూనిట్లు, ప్లాస్టిక్ పరిశ్రమలు, రసాయన కర్మాగారాలు సహా 305 పరిశ్రమలకు మూసివేత ఉత్తర్వులు జారీ అయ్యాయిఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ృఉఖఅః టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 10741, 'జనవాణి - కాలుష్య నివారిణి' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. పారిశ్రామిక జోన్‌లలో రాత్రి పెట్రోలింగ్ కూడా చేస్తారు. బల్క్ డ్రగ్, రసాయన పరిశ్రమలలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్(జిఒఆ) వ్యవస్థలను కఠినంగా అమలు చేయడం, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం వంటి ప్రభావవంతమైన చర్యలు కాలుష్య తగ్గింపుకు దోహదం చేస్తున్నాయి501 అధిక కాలుష్య కారక పరిశ్రమల నుండి ఉద్గారాలను, కాలుష్య కారకాలను నిరంతరం ట్రాక్ చేయడానికి 24/7 ఆన్‌లైన్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్టుగా ఓ అధికారి తెలిపారు. కాలుష్య నిబంధనలను అధిగమించినందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ 108 పరిశ్రమలను సమీక్షించింది. తక్షణ దిద్దుబాటు చర్యలను ఆదేశించింది. నిరంతరం పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ ని హెచ్చరించింది.అయితే ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్(హిల్ట్) పాలసీని ఆమోదిస్తూ అధికారిక ఉత్తర్వు జారీ చేసింది. దీని ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల, చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగ జోన్లుగా అధికారికంగా మార్చడానికి వీలు కల్పిస్తుంది.

## విలువలతో కూడిన జీవనమే పురోగతికి మార్గం

### - మండల విద్యాధికారి సురేందర్




**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** విలువలతో కూడిన జీవనమే పురోగతికి మార్గమని,విద్యార్థులు ఆదిశగా పయణించాలని మండల విద్యాధికారి సురేందర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు-2025 జిల్లా స్థాయి పోటీలు జిల్లా కేంద్రంలోని జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ సురేందర్, మాజీ ఎంఈఓ డానియల్, జిల్లా చెకుముకి కన్వీనర్ లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రీయ వైఖరిని అభివృద్ధి చేసుకోవాలని, మూఢనమ్మకా లు, డ్రగ్స్, బెట్టింగ్స్ వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. శాస్త్రీయ దృక్పథంతోనే మంచి పౌరులుగా ఎదగడం, పురోగతి సాధ్యమవుతుం దని డానియల్ స్పష్టం చేశారు. అలాగే శాస్త్రీయ జ్ఞానంతో పాటు విలువలతో కూడిన జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాల ని లక్ష్మణ్ సూచించారు. జి ల్లాలోని 14 మండలాల నుండి మొత్తం 78 మంది విద్యార్థులు పాల్గొనగా, మంథని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,మంథని జిహెచ్ఎస్ తెలుగు మీడియం,అంతర్గాం కేజీబీవీ రెసిడెన్షియల్, ప్రయివేటు పాఠశాలల నుండి సోక్రటిక్ హార్ట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ ఏడాది రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు డిసెంబర్ మూడో వారంలో కరీంనగర్ జిల్లాలోజరగనున్నాయని, జిల్లా విద్యార్థులు, ఉపాధ్యా యులు హాజరు కావాలని నిర్వాహకులు ఆహ్వానించారు. జిల్లా నలుమూలల నుండి పోటీలకు హాజరైన విద్యార్థుల కు భోజన వసతిని ఏర్పాటు చేసిన దేవేందర్ సింగ్‌కు నిర్వాహకులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు లు ఎస్.రత్నం, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి,జేవీవీ సభ్యులు షకీల్, జై.శ్రీ విష్ణు, స్వామి, ఎండి.రహీం, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నా రు.

# ఈ కాయల గురించి మీకు తెలుసా..

## ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..



టొమాటోలను మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. ఏ కూర అయినా సరే టొమాటోలు లేనిదే పూర్తి కాదు. టొమాటోలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. అయితే టొమాటోల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో రామ ములక్కాయలు కూడా ఒకటి. ఇవి టొమాటోల మాదిరిగానే ఉంటాయి. కానీ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటాయి. ఇవి కూడా టొమాటోల జాతికి చెందినవే. రామ ములక్కాయలు మనకు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభిస్తుంది. సూపర్ మార్కెట్లు లేదా రైతు బజార్‌లలోనూ కొన్ని చోట్ల ఈ కాయలను విక్రయిస్తుంటారు. అయితే టొమాటోలలాగే రామ ములక్కాయలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కళ్ల ఆరోగ్యానికి..: రామ ములక్కాయలను తినడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ కాయల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఈ కాయలు ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే బీటా కెరోటీన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. లుటీన్ అనే మరో యాంటీ ఆక్సిడెంట్ కూడా ఈ కాయల్లో అధికంగానే ఉంటుంది. విటమిన్ ఎ, లుటీన్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. రామ ములక్కాయల్లో ఉండే నారింజైన్, నారింజెనిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. ఇవి కళ్ల వాపులను తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్‌ను అధిక మొత్తంలో పొందాలంటే ఈ కాయలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. పచ్చి వాటికన్నా ఉడకబెట్టిన కాయల్లోనే మనకు లైకోపీన్ అధిక మొత్తంలో లభిస్తుంది. లైకోపీన్ వల్ల గుండె కండరాల వాపులు రాకుండా అడ్డుకోవచ్చు. రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా నివారించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

ఈ కాయల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రామ ములక్కాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ కొవ్వు మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు సైతం కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు సులభంగా తగ్గుతారు.

ఎముకల ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్ క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లైకోపీన్ వల్ల మహిళల్లో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. చర్మం లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు ఈ కాయలను మెత్తని పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఫేస్ ప్యాక్ చేసుకుంటే అందులో కాస్త తేనె కలపాలి. అదే జుట్టుకు వాడితే ఆ పేస్ట్‌లో కాస్త పెరుగు కలిపి వాడాలి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతాయి. ఇలా రామ ములక్కాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# దోమలను ఇలా తరిమేయండి..



ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువవుతోంది. తరచూ దోమలు కుడితే అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది. దీంతో చాలా మంది దోమల నివారణ కోసం రకరకాల మస్కిటో రిపెల్లెంట్లు, కాయిల్స్ వంటివి వాడుతుంటారు. ఇలాంటి కెమికల్ ఆధారిత నివారణలతో లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే ఈ దోమల బెడద నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధ చిట్కాలు పాటించటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని నిపుణులు చెబుతున్నారు.

దోమల నివారణ కోసం ఉపయోగించే మస్కిటో రిపెల్లెంట్‌లను శరీరానికి డైరెక్ట్‌గా అప్లై చేసుకోకూడదు. కొనే ముందు బాగా రీసెర్చ్ చేయాలి. ఉదయం-సాయంత్రం వేళ లాంగ్ స్లీవ్స్, షర్టులు, ప్యాంటులు, సాక్స్‌లు వేసుకోవటం ఉత్తమం. అలాగే, మస్కిటో నెట్‌లు కొనుక్కుని బెడ్ రూమ్‌లో పెట్టుకోవాలి. సిట్రోనెల్ల, లావెండర్, మారిగోల్డ్ వంటి మస్కిటో రెపెల్లెంట్ మొక్కలను ఇంట్లో ఏర్పాటు చేసుకోవటం వల్ల కూడా ఫలితం వుంటుంది. దాంతో పాటుగా ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి మడుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. దోమల బెడద ఎక్కువగా ఉన్న చోట ఫ్యాన్లు పెట్టుకోవాలి. దోమలు కొన్ని రకాల సువాసనలకు దూరంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి వాటిల్లో తులసి, వెల్లుల్లి, వేప నూనె, లవంగాలు, నిమ్మకాయ, ఉల్లిపాయ, ఆపిల్ సిడార్ వెనిగర్, యూకలిప్టస్ ఆయిల్, లావెండర్, పుదీనా వంటి సువాసనలకు దూరంగా పారిపోతాయి. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే మూలల్లో తరిగిన ఉల్లిపాయలను ఉంచటం వల్ల ఆ ఘాటైన వాసనకు దోమలు, ఈగలు ఆ దరిదాపుల్లో కనిపించవు.

# ఈ అలవాటును తప్పించండి..



చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో

ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్లు నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.

వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్లు చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి..

వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# చేతులు కడుగుదాం ఇలా



చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ఇన్ఫెక్షన్లు, రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అయితే, దీని ప్రయోజనం అలా ఉంచితే చేతుల పరిశుభ్రత గురించి ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుందాం.

గ్లవ్స్ తొడుక్కుంటే: ఎక్కువసేపు గ్లవ్స్ తొడుక్కోవడం వల్ల సురక్షితంగా ఉంటామని చాలామంది భ్రమలో ఉంటారు. నిజానికి గ్లవ్స్ తొడుక్కొని వస్తువులు ఇతరులకు ఇవ్వడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. వండుతున్నప్పుడు, ఏవైనా వస్తువులు పట్టుకొన్నప్పుడు గ్లవ్స్ వాడుతుంటారు. అయితే, గ్లవ్స్ విడిచిపెట్టిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాల్సిందే. అంతేకాదు గ్లవ్స్‌లో కూడా దుమ్ము, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి ఇతరులకు వ్యాపించవచ్చు. కాబట్టి, గ్లవ్స్ ధరించడం కంటే సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిది.

వేడినీళ్లు- చల్లనీళ్లు: హ్యాండ్ వాష్ పనితీరును నీటి ఉష్ణోగ్రత ఏమాత్రం మార్చదు. సూక్ష్మక్రిములు సబ్బు ప్రభావంతో చనిపోతాయి. నీళ్లు అవి వేడివైనా, చల్లటివైనా సబ్బు వదిలిపోవడానికే అని గుర్తుంచుకోవాలి. చేతులు కడుక్కునే విషయంలో చల్లటి నీళ్ల కంటే వేడి నీళ్లు ప్రయోజనకరమని శాస్త్రీయమైన ఆధారాలైతే లేవు.

శానిటైజేషన్-హ్యాండ్ వాష్: హ్యాండ్ వాష్ (సబ్బు) స్థానాన్ని శానిటైజర్ భర్తీ చేయదు. సబ్బుతో చేతులు కడుక్కోవడంతో వచ్చే ఫలితం శానిటైజర్ ద్వారా ఒనగూరదు. అన్ని సూక్ష్మక్రిములతో పోరాటానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం సమర్థంగా పనిచేస్తుంది. శానిటైజ్ చేసుకోవడం దీనికి ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి, చేతులను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల నుంచి తగిన రక్షణ లభిస్తుంది.

పద్ధతి అవసరం లేదా: చేతులను సరైన పద్ధతిలోనే కడుక్కోవాలి. అరచేతులు, వెనకభాగం, వేళ్ల మధ్య, బొటనవేలు, గోళ్ల భాగం, మణికట్టు ఇలా అన్ని భాగాలను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఆ తర్వాత శుభ్రమైన తువాలుతో తుడుచుకోవాలి. సరైన విధానం వైద్యుడి ద్వారా తెలుసుకొని ఆచరించడం మేలు.

వాష్‌రూం తర్వాత వంటకుముందు: వాష్‌రూంకు వెళ్లివచ్చిన తర్వాత, వంటకు ముందు చేతులు కడుక్కోవాలని సాధారణంగా అనుకుంటారు. అయితే ఇది పరిసరాల్లో మనం ముట్టుకునే వస్తువులను బట్టి ఆధారపడి ఉంటుంది. రైళ్లు, బస్సులు, బాగా జనం ఉన్న ప్రదేశాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు, తలుపు హ్యాండిల్స్, ఫర్నిచర్, స్విచ్చులు, లిఫ్ట్ బటన్లు ఇలా ఎక్కువమంది వాడే వస్తువులను పట్టుకొన్నప్పుడు, మీ ముఖం, కండ్లు, ముక్కు తాకిన సందర్భాల్లో, గ్లవ్స్ ధరించడానికి ముందు ఆ తర్వాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిందే.



# ఈ పండ్లను మీరు ఎప్పుడైనా తిన్నారా..

## వీటి లాబాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు..!

స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్ బెర్రీ.. ఇలా అనేక రకాల బెర్రీ పండ్ల గురించి మీరు వినే ఉంటారు. ఆయా పండ్లను చూసి కూడా ఉంటారు. కానీ మల్బెర్రీ పండ్లను మీరు ఎప్పుడైనా చూశారా.. ఈ పేరును చాలా మంది వినే ఉంటారు. కానీ ఈ పండ్లను చూసి ఉండరు. మనకు రహదారుల పక్కన లేదా స్టోర్స్‌లో మల్బెర్రీ పండ్లను బాక్సుల్లో పెట్టి విక్రయిస్తుంటారు. ఇవి ఎంతో తియ్యగా ఉంటాయి. చూసేందుకు ఆకర్షణీయంగా కూడా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మల్బెర్రీ పండ్లు సాధారణంగా తెలుపు, ఎరుపు, బ్లాక్ రంగుల్లో ఉంటాయి. అయితే ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మల్‌బెర్రీ పండ్లలో ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

రోగాలు రాకుండా రక్షణ..: రెస్వెరెట్రాల్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ బెర్రీ పండ్లలో అధికంగానే ఉంటాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాల నుంచి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇదే పోషక పదార్థం రెడ్ వైన్‌లోనూ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. గుండె కండరాలు వాపులకు గురి కాకుండా చూస్తుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: మల్బెర్రీ పండ్లను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో 1-డిఆక్సీనోజిరిమైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్లను శరీరం త్వరగా గ్లూకోజ్‌గా మార్చకుండా చూస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ పెరగవు, నియంత్రణలో ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. మల్బెర్రీ పండ్లలో జియాజంతిన్, లుటీన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. కళ్లు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది.

క్యాన్సర్ రాకుండా..: మల్బెర్రీ పండ్లలో బయో యాక్టివ్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగాఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే ఆంథో సయనిన్స్, రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనాల్ల క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకో వచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ కె, క్యాల్షియం, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగామార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండ్లనతినడం వల్ల ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఇలా మల్బెర్రీ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సెగగడ్డలు బాధిస్తున్నాయా..



వేడి కారణంగా ఎక్కడపడితే అక్కడ సెగగడ్డలు వస్తుంటాయి. అవి వచ్చినప్పుడు తీవ్రమైన నొప్పి, బాధ ఉంటుంది. చాలా మంది ఈ బాధను తట్టుకోలేరు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే వీటి నుండి ఉపశమనం పొందాలంటే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి. సెగగడ్డలు రాకుండా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పండ్లను రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా చేయటం వల్ల బాక్టీరియా తగ్గుతుంది. రోజుకు 3 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి. కొబ్బరి నీళ్లు, జ్యూసులు, కూరగాయల రసాలను సేవించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయటం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్ళి పోతాయి. రక్తం శుద్ధి జరుగుతుంది. తద్వారా సెగగడ్డలు రాకుండా చూసుకోవచ్చు. తొక్క తీసిన నాలుగు వెల్లుల్లి రెబ్బలు, అరస్పూన్ వాము కలిపి మెత్తని పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ని సెగగడ్డలు ఉన్న ప్రదేశంలో రాసి పది నిమిషాలు అయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఒక గిన్నెలో రెండు స్పూన్ల బియ్యంపిండి వేసి దానిలో నీటిని కలిపి పొయ్యి మీద పెట్టి ఉడికించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సెగ గడ్డలపై రాయాలి. పూర్తిగా ఆరనివ్వాలి అనంతరం చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. కలబంద జెల్‌లో కొద్దిగా పసుపు కలిపి. గడ్డలపై అప్లై చేయాలి. ఆరిన తర్వాత చల్లని వాటర్‌తో శుభ్ర పరుచుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# సినిమా..

# 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్‌పై దిల్ రాజు క్లారిటీ





'ఎల్లమ్మ' సినిమా అనౌన్స్ చేసిన రోజు నుంచి ఈ చిత్రాన్ని వరుస ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దర్శకుడు వేణు యూడుగంటి (వేణు బలగం) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్ పట్ల భారీ అంచనాలు ఉండగా, రెండేళ్లుగా హీరో ఎవరు అనే విషయంలో మాత్రం గందరగోళం కొనసాగుతోంది. మొదట ఈ సినిమాలో నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్నాడని ప్రకటించిన మేకర్స్, ఫస్ట్‌లుక్ కూడా విడుదల చేశారు. అయితే అనుకోని కారణాల వల్ల నాని ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు.తర్వాత ఈ చిత్రంలో నటించేందుకు శర్వానంద్ ఎంట్రీ ఇచ్చారు. కొంతకాలం తర్వాత ఆయనే తప్పుకున్నారు. అనంతరం నితిన్ హీరోగా ఫిక్స్ అయిపోయారని, షూటింగ్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని నితిన్ స్వయంగా ప్రకటించారు. కానీ కొన్ని రోజులకే ఆయనను కూడా ఈ చిత్రం నుంచి తప్పించారని సమాచారం. ఇలా వరుసగా ముగ్గురు హీరోలు మారడంతో 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో చివరకు ఈ చిత్రానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. గోవాలో జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లమ్మ సినిమాకు హీరో ఇప్పటికే ఫైనల్ అయ్యాడు. త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అలాగే హీరోయిన్ వివరాలు కూడా డిసెంబర్‌లో వెల్లడిస్తాం. మా బ్యానర్ నుంచి 2026లో ఆరు సినిమాలు రిలీజ్ అవుతాయి.


వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్' షూటింగ్ జరుగుతోంది" అని తెలిపారు. దీంతో 'ఎల్లమ్మ' సినిమాను ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది నిజంగా గుడ్ న్యూస్. ఇన్ని మార్పుల తర్వాత కూడా ప్రాజెక్ట్ నిలిచేలా ఉండటం మేకర్స్ నమ్మకాన్ని చూపిస్తోంది. ఇప్పుడు అందరి చూపు కొత్త హీరో, హీరోయిన్ ఎవరన్న దానిపైనే ఉంది.ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుంది అనే దానిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది. కొద్ది రోజుల క్రితం బలగం అనే చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టిన వేణు ఇప్పుడు తన రెండో చిత్రంతో ఎలాంటి విజయం అందుకుంటాడో చూడాలి.

## స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా




ప్రభాస్‌హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమెఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా




ప్రముఖదర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విష యం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగాఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్పమార్పు చేయాలని నిర్ణయిం చుకున్నట్లు సమాచారం. ఈసినిమా పలుభాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మా త్రం'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు తెలుస్తోంది. ఇతరఅన్ని భాషల్లో మాత్రం'వార ణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసేఅవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదంఎదుర్కోగా.. మేకర్స్‌ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దుమణిగింది.




## శరవేగంగా పెద్ది షూటింగ్

గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్ట్స్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు.ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది.రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు- సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆపాటను విన్నట్టు-, అది అద్భుతంగాఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు-, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి.దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు- సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు- గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## అందుకే ఆ సినిమా ఒప్పుకున్నా..



జయాపజయాల సంగతి అటుంచితే.. మంచి నటిగా మాత్రం గుర్తింపు తెచ్చుకుంది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అతికొద్ది సమయంలోనే తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్నది ఈ భామ. ఈ మధ్యకాలంలో విడుదలైన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి సినిమాలు అనుకున్నంతగా ఆడకపోయినా.. జాన్వీకి మాత్రం మంచి పేరే తెచ్చిపెట్టాయి. రీసెంట్‌గా కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఓ యాక్షన్ డ్రామాలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది జాన్వీ. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధానపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో నటించేందుకు తానెందుకుఒప్పుకున్నానో తెలుపుతూ 'కేవలం రొమాంటిక్ పాత్రలే కాదు, ఏజానర్ సినిమాలైనాచేయగలనని నిరూపించుకోడానికే ఈ సినిమాకుసైన్ చేశాను. ఇది యాక్షన్,రివైంజ్, ఇంటెన్స్ డ్రామా. ఇందులో నాది స్ట్రాంగ్ క్యారెక్టర్. ఎనర్జీ, ఎమోషన్, మరింత బలంగా చూపించే అవకాశం ఈ పాత్రలో ఉన్నది' అని జాన్వీ తెలిపింది.

## మృణాల్ బ్యూటీ సీక్రెట్ ఇదే..!



'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి.

## వారికంటే తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నా..



హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటిస్తూ ప్రేక్షకులను మైమరపించిన వారిలో ప్రియమణి ఒకరు. ఒకప్పటి హీరోయిన్ అయినప్పటికీ ఇప్పటికీ తన నటనతో ఇండస్ట్రీలో సత్తా చూపిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ చిత్రాలతో పాటు వెబ్‌సిరీస్‌ల్లోనూ నటిస్తోంది. త్వరలో 'ది ఫ్యామిలీ మ్యాన్-3' వెబ్ సిరీస్‌తో రాబోతుంది. ఈనేపథ్యంలో.. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ప్రియమణి ఇండస్ట్రీలో పరిస్థితుల గురించి షాకింగ్ విషయాలు బయటపెట్టింది. పారితోషికం, షూటింగ్ టైమింగ్స్ ఇష్యూపై స్పందించింది. "నేనెప్పుడూ రెమ్యునరేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదు. నాకున్న మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శక నిర్మాతలను అందుకు తగినట్లుగా పారితోషికం ఇవ్వమని అడిగేదాన్ని. చాలా సందర్భాల్లో నా తోటి నటించిన వారికంటే తక్కువ రెమ్యునరేషన్ తీసుకున్నాను. నా పాత్ర, నిడివి చూసుకొని సినిమాలను అంగీకరిస్తాను. కానీ డబ్బులు ఎంత ఇస్తున్నారనేది నేను పట్టించుకోను. ఆ పాత్రకు నేను అర్హురాలిని అని భావిస్తే మాత్రమే పారితోషికం పెంచమని డిమాండ్ చేసేదాన్ని అంతేకానీ అనవసరంగా ప్రతిసారి పారితోషికం పెంచమని కోరలేదు. ఇన్నాళ్లుగా నేను ఇండస్ట్రీలోని హీరోలకంటే నేను తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నా" అని చెప్పింది. అంటే అనవసరంగా కొంతమంది సెలబ్రిటీలు పారితోషికం పెంచమని అడుగుతున్నారని చెప్పకనే చెప్పింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215